విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

సోమవారం 27 అక్టోబరు 2025 8 పేజీలు

'మొంథా'పై అప్రమత్తం

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: మొంథా తుపాన్ దృష్ట్యా జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జిల్లా మరియు ప్రాంతీయ ప్రత్యేక అధికారి ఆర్.పి.సిసోడియా అన్నారు. జిల్లా పరిస్థితులపై సమీక్షించుటకు ఆదివారం గుంటూరు విచ్చేసిన ప్రత్యేక అధికారి కంట్రోల్ రూమ్ కార్యకలాపాలను తనిఖీ చేశారు. అనంతరం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. తీవ్ర తుఫానుగా పరిణామం చెందుతున్న తరుణంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ఆహార నిలువలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలలో ఎవరు ఉండరాదని అన్నారు. బలహీనంగా ఉన్న గోడలు, పూరి గుడిసెలు వంటి వాటిని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. బలహీనంగా ఉన్న చెట్లు, పడిపోవడానికి అవకాశం ఉన్న చెట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ రంపాలు (పవర్ సాస్) సిద్ధంగా పెట్టుకుని చెట్లు పడితే తక్షణం తొలగించుటకు సిద్ధంగా ఉండాలని సూచించారు. గండి పడుటకు అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించి వెంటనే గండి పూడ్చుటకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న కాజ్ వేలు వద్ద రెవిన్యూ, పోలీస్ ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగు నీరు ఎక్కడా కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయం కలిగితే తాగు నీటిని పంపింగ్ చేయుటకు జనరేటర్లు సిద్ధం చేయాలని సూచించారు. తాగు నీటి అంతరాయం ఉండరాదని చెప్పారు. విద్యుత్ స్తంభాలు కూలిపోయిన వెంటనే పునరుద్ధరణ చేయుటకు అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. కాలువల్లో పూడికలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం, పశువుల ప్రాణ నష్టం జరగరాదని చెప్పారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలించుటకు వాహనాలు సిద్ధంగా ఉండాలని, వాటికి ఇంధనం అవసరమైతే బ్యాంకులను అనుసంధానం చేయాలని తెలిపారు. వృద్ధులు, పిల్లలకు ఉంటారని వారికి పాలు, బిస్కెట్లు వంటివి సిద్ధంగా ఉంచాలని చెప్పారు. మొబైల్ టవర్లు నిరంతరం పనిచేయాలని, మొబైల్ ఆపరేటర్లకు స్పష్టమైన

మిగతా 2 లో ...

సొమ్మును అదానీకి కట్టబెట్టారు

మోదీ అవినీతి పాలనపై సీపీఐ

జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి

విశాలాంధ్ర-మంగళగిరి : దేశంలో అవినీతి, కుంభకోణాలు రోజురోజుకీ విస్తరిస్తూ మోదీ పాలనలో పరాకాష్టకు చేరుకున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి తీవ్రంగా విమర్శించారు. ప్రజలు సంవత్సరాలుగా కష్టపడి పొదుపుగా పెట్టుకున్న రూ.32 వేల కోట్ల ఎల్ఐసీ నిధులను మోదీ ప్రభుత్వం తమ స్నేహితుడు అదానీకి అప్పగించడం దారుణమని ఆయన అన్నారు. ఆదివారం మంగళగిరి పట్టణంలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్ సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల సొమ్మును మిత్రుడి చేతిలో పెట్టడం మోదీ ప్రభుత్వానికి మామూలు విషయం అయిపోయింది. ఈ పాలన పూర్తిగా కార్పొరేట్ ప్రయోజనాలకే కట్టుబడి ఉంది. పేద, మధ్యతరగతి కుటుంబాలు శ్రమించి దాచుకున్న సొమ్మును కూడా ఈ ప్రభుత్వం వ్యాపారవేత్తల ఖాతాల్లోకి మళ్లిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా సొమ్మును అదానీకి ఇవ్వడానికి నువ్వు ఎవరు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారని, ఈ విధమైన దోపిడీ పాలనను ఇక సహించబోమని ప్రజల్లో విస్తృత స్థాయిలో

మిగతా 2 లో ...

తుపాను హెచ్చరికతో

పాఠశాలలకు సెలవులు

'ముంథా'పై అప్రమత్తం : కలెక్టర్ కృత్తికా శుక్ల

విశాలాంధ్ర బ్యూరో - పల్నాడు జిల్లా: పల్నాడు జిల్లాలో సోమవారం నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు, అంగన్‌వాడీ పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. మొంథా తుఫాన్ కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా నివారించే ఉద్దేశంతో జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఇతర విద్యాసంస్థలు అన్నింటికి 27 తేదీ సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వాతావరణ శాఖ మొంథా తుఫాన్ హెచ్చరికల కారణంగా జిల్లాలో నిర్వహించవలసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు . ఈ విషయాన్ని ప్రజలు గమనించాల్సిందిగా కోరారు. వాయుగుండం ప్రభావం నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సిబ్బంది తప్పనిసరిగా ప్రధాన కేంద్రంలోనే ఉండాలని,సచివాలయ సిబ్బంది వారి

మిగతా 2 లో ...

బోధనేతర అధికారులతో

విద్యావ్యవస్థ నిర్వీర్యం-3

తుఫాన్ నష్ట నివారణకు

చర్యలు: మేయర్ -8

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

సెల్ టవర్ సిగ్నల్స్

ఆగకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ డికె.బాలాజీ

విశాలాంధ్ర-చల్లపల్లి : మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రానున్న మూడు రోజుల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డికె. బాలాజీ తెలిపారు. ఆదివారం సాయంత్రం చల్లపల్లి వచ్చిన ఆయన విద్యుత్శాఖ సబ్‌స్టేషన్ను పరిశీలించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యుత్ స్తంభాలు, మెటీరియల్, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అధికారులతో సమీక్షించారు. గ్రామంలో సెల్ టవర్స్ ఎన్ని ఉన్నాయని వివరాలడిగిన ఆయన తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న సెల్వర్ను పరిశీలించి సంబంధిత టెక్నీషియన్ను పిలిచి మాట్లాడారు. సెల్ సిగ్నల్స్ నిరంతరాయంగా కొనసాగాలనీ, సిగ్నల్స్ ఆగకుండా చూసుకోవాలనీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయినపుడు

మిగతా 2 లో ...

ముంచుకోస్తున్న తుపాను

-ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు

-పలు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు

-24గంటలు అందుబాటులో కమాండ్ కంట్రోల్ కేంద్రం

-ఆస్తి, ప్రాణ నష్టం లేకుండా చర్యలు : కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విశాలాంధ్ర-విజయవాడ: వివిధ ప్రాంతాల్లో మొంథా తుపాను ప్రభావం అధికంగా ఉండవచ్చని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. జిల్లా ప్రజలకు ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సురక్షితమైన పునవావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. మండల స్థాయిలో విపత్తు స్పందన బృందాలతో పాటు గ్రామ, వార్డు సచివాలయం యూనిట్‌గా సిబ్బంది పటిష్ట సమన్వయంతో, ముందు జాగ్రత్తలతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం కలెక్టర్ ఆర్డీవోలతో పాటు రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, పౌర సరఫరాలు, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, మునిసిపల్ తదితర శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృష్ణా నదితో పాటు వాగులు వంకల్లో నీటి ప్రవాహాలను పర్యవేక్షిస్తూ.. అటువైపు ఎవరూ వెళ్లకుండా చూడాలన్నారు. వర్షాలు, గాలుల సమయంలో ప్రయాణాలు చేయకుండా అవగాహన కల్పించాలని పశువులను చెట్ల కింద, స్తంభాలతో కట్టకుండా చూడాలని

మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

'మొంథా'పై అప్రమత్తం

ఆదేశాలు జారీ చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు మొబైల్ ఫోన్ లలో అందుబాటులో ఉండాలని అన్నారు. రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని పొలంలో ఉన్న పంటలు ఎటువంటి నష్టానికి గురి కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మొంథా తుఫాను ప్రభావం గత తుఫాన్ల కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో అధికారులు రానున్న నాలుగు రోజులు సహాయక సన్నద్ధత చర్యలపై పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. పునరావాస కేంద్రాలను గుర్తించి సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో సహా డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎటువంటి పరిస్థితులను అయినా ఎదుర్కొనడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. జిల్లా అధికారులు శాఖల వారీగా చేపడుతున్న చర్యలను వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, కమిషనర్ పులి శ్రీనివాసులు, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సొమ్మును అదానీకి కట్టబెట్టారు

ఆవేదన వ్యక్తమవుతోందని కోట మాల్యాద్రి పేర్కొన్నారు. దేశాన్ని గుజరాతీ మిత్రుల ముఠా కలిసి దోచుకుంటున్నారనే భావన ప్రజల్లో బలపడుతోంది. ఈ దుర్మార్గ పాలనపై ప్రజలు, ఉద్యోగులు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. మోదీ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలపై కన్నేసి కార్పొరేట్ లాభాలకే ప్రాధాన్యత ఇస్తోందని, దీనివల్ల ఆర్థిక వ్యవస్థనే సంక్షోభంలోకి నెట్టేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే ప్రజలు, కార్మికులు, రైతులు, యువత, ఉద్యోగులు ఐక్యమై పోరాడాల్సిన అవసరం ఉందని కోట మాల్యాద్రి పిలుపునిచ్చారు. సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ అదానీపై లంచం.. మోసం.. ఆరోపణలపై అమెరికాలో కేసులు నమోదు చేసిందని అమెరికా యూరోపియన్ బ్యాంకులు అదానీకి రుణాలు ఇవ్వడానికి ససేమిరా అనడంతో దిక్కుతోచని స్థితిలో ఆదానీ గ్రూపులు అప్పులు చెల్లించలేని స్థితిలో దివాలా తీసిన అపర కోటీశ్వరుడు. ప్రపంచ బిలియనీర్ అయిన అధానీని ఆదుకోవడం కోసం ఎల్ఐసీపై ఒత్తిడి తెచ్చి అదానీ గ్రూప్ సంస్థలకు రూ.32 వేల కోట్ల ప్రజాధనాన్ని మళ్లించడం జరిగిందని, ఆదానీ పోర్టుకు రూ.5 వేల కోట్ల బాండ్లను ఎల్ఐసీ కొనుగోలు చేసిందని ఇది ఎక్కడ నిర్ణయించారని ఆయన ప్రశ్నించారు. దీనిని తీవ్రంగా సీపీఐ వ్యతిరేకిస్తోందని దీనికి వ్యతిరేకంగా పెద్దఎత్తున పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. అంతర్జాతీయంగా బ్యాంకులు అదానీ సంస్థలకు అప్పులు ఇవ్వటానికి నిరాకరిస్తుంటే అదానీ కంపెనీలన్నీ డొల్ల కంపెనీలు అని ఆదానీ చేసే వ్యాపారాలు మొత్తం మోసపూరితమని ప్రపంచం కోడై కూస్తుంటే మన దేశ ప్రధాని మాత్రం గుజరాత్ ప్రాంతం వాడని ప్రాణ స్నేహితుడిని యావత్తు దేశ సంపదను దోచిపెట్టటానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం విద్యుత్ రంగాన్ని.. రైల్వేలను.. ఎయిర్‌పోర్ట్‌లను.. పోర్టులను.. బీఎస్ఎన్ఎల్‌ను దివాలా తీయించి అంబానీ అదానీలకు అప్పజెప్పేందుకు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని అందులో భాగంగా మన రాష్ట్రంలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని సైతం అదానీకి అప్పచెప్పటానికి ప్రయత్నం చేస్తుంటే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పల్లెత్తు మాట మాట్లాడకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుందన్నారు. కుటమినేతల అభిప్రాయాలు చెప్పాలని, ఎల్ఐసీని కాపాడాలని, ఎల్ఐసీ నుంచి రూ.32 వేల కోట్లు మళ్లించడానికి తిరిగి ఎల్ఐసీలో జమ చేసేలా పెద్దఎత్తున పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణలు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు రాబట్టడానికి ప్రయత్నం చేయాల్సింది పోయి విశాఖ ఉక్కును అమ్మేస్తూ పోర్ట్‌లను అదానీకి అప్పచెబుతున్నారన్నారు. ఎల్ఐసీ నుంచి రూ.32 వేల కోట్లు అదానీ గ్రూపుకు బదిలీ చేస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు మాట్లాడకపోవడం చాలా దారుణమని వారు అన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తన గుజరాతీయులకు దేశ సంపద మొత్తం దోచిపెడుతుందని, రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ అడ్డుకోవడానికి ప్రజానీకం పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధపడాలని వారు పిలుపునిచ్చారు.

తుపాను హెచ్చరికతో

పాఠశాలలకు సెలవులు

సచివాలయం పరిధిలోనే ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలని, అత్యవసర ఫోన్ నంబర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను, పూరి గుడిసెలలో ఉన్న కుటుంబాలను పునరావాస కేంద్రాలు, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని,విద్యుత్ సరఫరా అంతరాయాలను తక్షణమే పరిష్కరించాలని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాలతో పాటు అన్నీ మండల కార్యాలయాలలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని అన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

సెలవర్లకు ఆయిల్ వినియోగం ఎంత అవుతుందని ప్రశ్నించిన కలెక్టర్ ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ, గ్రామాల్లో పూరిళ్లలో నివసించే ప్రజలకు అవగాహన కల్పించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.

సచివాలయ భవనంలో తహసీల్దార్ కార్యాలయం : కలెక్టర్

చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరిఉండటం, వర్షాలకు పెచ్చులూడి పడుతున్న నేపథ్యంలో ఆర్ ఐ ఘంటసాల కృష్ణమోహన్ విజ్ఞప్తితో కార్యాలయ గదులను కలెక్టర్ పరిశీలించి పెచ్చులూడిన శ్లాబ్ను చూశారు. చల్లపల్లి ప్రధాన సెంటర్లో నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న సచివాలయ భవనంలోకి తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చుకోవాలనీ, ఈమేరకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆర్ ఐ ఘంటసాల కృష్ణమోహన్ కు సూచించారు. చల్లపల్లి గ్రామ పంచాయతీకి వెల్ఫా మిషన్ మంజూరు అయిందనీ, తుఫాను అనంతరం చల్లపల్లి వచ్చి అందచేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, విద్యుత్ శాఖ ఈఈ పులి శివనాగేశ్వరరావు, డిప్యూటీ సీఈవో ఆర్వి. ఆనందకుమార్, ఇన్ఛార్జి ఏఈ బసవశాస్త్రులు, సూపరింటెండెంట్ అతావుల్లా, ఏఈలు బొప్పన శ్రీనివాసరావు, ధర్మేశ్వరరావు, చల్లపల్లి కార్యదర్శి పివి.మాధవేంద్రరావు, ఎలి ఎలిషాప్రసాద్, కార్యదర్శులు, వీఆర్వోలు, రైతుసంఘం నేత హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు..

ముంచుకొస్తున్న తుపాను

పేర్కొన్నారు. రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సహాయసహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. వైద్య సంరక్షణ అవసరమైన రోగులు, గర్భిణీలను సమీప ఆసుపత్రుల్లో చేర్చాలని సూచించారు. అధికారులు, సిబ్బంది 24గంటలు పాటు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఏదైనా అత్యవర పరిస్థితి ఉంటే కమాండ్ కంట్రోల్ కేంద్రం 91549 70454కు నివేదించాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా శిథిలావస్థలో ఉన్న భవంతులను గుర్తించి అందులో ఎవరూ ఉండకుం డా పునరావాస శిబిరాలకు తరలించి అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. చేపల వేటకు నదిలోకి మత్స్యకారులు వెళ్లకుండా ఆయా గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీచేయాలన్నారు. ఒకవేళ చెట్లు, స్తంభాలు ఎక్కడైనా పడిపోతే వెంటనే తొలగించేందుకు అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాల న్నారు. ముందు జాగ్రత్తగా కొత్త స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను సిద్ధంగా ఉంచుకోవాల న్నారు. విధుల నిర్వహణలో నిబద్ధత, నిరంతర అప్రమత్తతే ప్రజల భద్రతకు భరోసానిస్తుందని.. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్డీవో కె.మాధురి తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ కమాండ్ కంట్రోల్ కేంద్రాల ఫోన్ నెంబర్లు...

విపత్తు సమయంలో ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకుండా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకున్నేందుకు విజయవాడలోని కలెక్టర్ కార్యాలయం 91549 70454, విజయవాడ ఆర్డీవో కార్యాలయం: 0866 2574454, నందిగామ ఆర్డీవో కార్యాలయం 78930 53534,తిరువూరు ఆర్డీవో కార్యాలయం 83098 36215, 08673251235, విజయవాడ సెంట్రల్ తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ 9849903993, విజయవాడ పశ్చిమ తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ 9121284800,విజయవాడ ఉత్తరం తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ 9849903979, విజయవాడ తూర్పు తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ 6305598505, 9121284808, విజయవాడ రూరల్ తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ 8555841358, 9849903997, ఇబ్రహీంపట్నం తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ 8008362172, 9849903999, జి.కొండూరు తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ 8985818829, 9908664616, మైలవరం తహశీల్దార్ కార్యాలయ కంట్రోల్ రూమ్ 9849903972 ఫోన్ నెంబర్లను ప్రజలకు అందుబాటులో ఉంచారు.

దూసుకొస్తున్న 'మొంథా'

అధికారులు అప్రమత్తం : ఆదేశించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : మొంతా తుఫాను సందర్భంగా చేపట్టవలసిన ముందస్తు ఏర్పాట్లపై ఆదివారం మధ్యాహ్నం క్షేత్రాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుఫానుకు వరదలకు చాలా తేడా ఉందనే విషయాన్ని అధికారులందరూ గమనించాలని, వరదలకు కేవలం కృష్ణానది పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెడతామని, అదే తుఫాను వస్తే జిల్లా అంతా ప్రభావం చూపుతుందని, అన్ని గ్రామాల్లోనూ భీభత్సమైన వర్షం కురవడంతో పాటు తీవ్రమైన ఈదురుగాలులు వీస్తాయన్నారు. మొంత తుఫాను ప్రభావంతో ఈ నెల 27 నుండి 29 వరకు జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గ్రామాల్లో తుఫాను హెచ్చరికలపై దండోరా వేయించి అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు తెలపాలన్నారు. జిల్లాకు చెడ్డపేరు రాకుండా మండలాలు, మున్సిపాలిటీలలో సంబంధిత ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, ఎస్ఐచ్ఓలు, మండల ప్రత్యేక అధికారులు కలిసికట్టుగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా మనుషులుగానీ, పశు వులు గాని ప్రాణనష్టం జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రస్తుత తుఫాను వలన గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, విద్యుత్ స్తంభాలతో పాటు చెట్లు నేలకొరుగుతాయన్నారు. ముఖ్యంగా తాటాకు ఇల్లు, పూరిపాకలు, మట్టి ఇల్లు, పాతబడిన ఇల్లు పడిపోయే అవకాశం ఉన్నందున అటువంటి ఇళ్లతో సహా లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాల్లోని సహాయక శిబిరాలకు తరలించాలన్నారు. లేనిపక్షంలో ప్రాణ నష్టం జరుగుతుందని, అలా జరిగితే తీవ్రంగా పరిగణిస్తామని, అందుకు బాధ్యులైన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. వీఆర్ఓలు, పంచాయితీ కార్యదర్శుల ద్వారా సహాయక శిబిరాలను ఆదివారం కు గుర్తించి ఆ ప్రాంత ప్రజలను తరలించాలనే జాబితా ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు.

సహాయక శిబిరాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సహాయ శిబిరాల వద్ద ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, తిరిగి ఇంటికి సురక్షితంగా చేర్చే బాధ్యత అధికారులందరిపైన ఉందన్నారు. అన్నిపనులు సజావుగా జరిగాయా లేదా మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని, ప్రజలు మొబైల్ చార్జింగ్ చేసి పెట్టుకోవాలని, ఎమర్జెన్సీ లైట్లు సిద్ధంగా ఉంచుకునేలా చూడాలని, ప్రభుత్వ శాఖల సిబ్బంది రైన్‌కోట్లు అందుబాటులో ఉంచుకోవాలని, చెట్లు పడిపోయి రాకపోకలకు అంతరాయం కలుగకుండా వాటిని వెంటనే తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలని, అలాగే భారీ వర్షాలకు రహదారులు, కాజ్వేలు గానీ దాటాలని కొందరు ప్రయత్నిస్తారని, గండిపడి వరద నీటి ప్రవాహంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉందని, బాధ్యులైన వారికి కాపలా ఉంచి రాకపోకలు నియంత్రించాలన్నారు. నిత్యావసర సరుకులు చౌకదుకాణాలకు ఆదివారం సాయంత్రానికి చేర్చాలని, మంచినీరు కలుషితం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి ప్రవాహం లేని ప్రదేశాల్లో పైపులు అడ్డుగా ఉంటే వాటిని తొలగించాలని జలవనరులు, రెవెన్యూ, పోలీస్ శాఖల సిబ్బంది కలిసికట్టుగా ఈ పనులు చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే గాలికి ఊగులాడుతున్న ఫ్లెక్సీలు, పాత ఫ్లెక్సీలు వెంటనే తొలగించాలని, రాకపోకల మార్గంలో ఎవ్వరికి ఎలాంటి ప్రమాదం జరుగకుండా ముందుగానే జాగ్రత్త వహించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని నీటిని తోడేందుకు కావలసిన యంత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు.

ఈ టెలికాన్ఫరెన్స్‌లో మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీఓలు స్వాతి, బాలసుబ్రహ్మణ్యం, షారోన్ మండల ప్రత్యేక అధికారులు, ఎల్డీఓ లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలకు హార్మోన్ల సమతుల్యత లోపమే కారణం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మన శరీరంలోని అన్ని ఆరోగ్య సమస్యలకు హార్మోన్ల సమతుల్యత లోపమే కారణమని ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ నందిపాటి వెంకట సందీప్ అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆరోగ్య సభ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ నందిపాటి వెంకట సందీప్ మాట్లాడుతూ నేటి సమాజంలో అనేకమందిని ఇబ్బంది పెడుతున్న సమస్యలలో మధుమేహం చాలా ముఖ్యమైన సమస్య అని, ఈ సమస్య ముఖ్యంగా మన శరీరంలోని ప్యాంక్రి యాస్‌లో బీటా కణాల సంఖ్య తగ్గటం వల్ల ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గుతుందన్నారు. ఈ మధుమేహ సమస్య కేవలం బీటా కణాల లోపం వల్లే కాకుండా, మానసిక ఒత్తిడి వల్ల

కానీ, నిద్రలేమి వల్ల కానీ కొన్ని హార్మోన్లు సమతుల్యత కోల్పోవడం వల్ల కూడా వస్తుందని, ఈ నేపథ్యంలో రోజుకు కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటలు మంచి నిద్ర పోతూ, మానసిక ఒత్తిడికి గురి కాకుండా, పౌష్టి కాహారం తీసుకుంటూ, శరీరానికి వ్యాయామం ఉండేలా చేస్తే ఈ మధుమేహ సమస్య నుండి బయ టపడొచ్చని చెప్పారు. మన శరీరంలోని థైరాయిడ్ గ్రంధి థైరాక్సిన్ హార్మోన్‌ను ఎక్కువ ఉత్పత్తి చేసినా లేదా తక్కువ ఉత్పత్తి చేసినా థైరాయిడ్ సమస్య వస్తుందన్నారు. మన శరీరంలో అతి ముఖ్యమైన ఎడ్రినలిన్ గ్రంధి గురించి వివరిస్తూ, ఎడ్రినలిన్ గ్రంధి వల్ల కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తి అవుతుందని, ఈ కార్టిసాల్ స్థాయి లు ఎక్కువైతే ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయని, దీర్ఘకాలంలో ఇది ఆరోగ్యానికి హానికరమని పేర్కొ న్నారు. అయితే ఈ అడ్రినలిన్ గ్రంధి శరీరానికి అవసరమైన శక్తి కోసం రక్తంలో గ్లూకోజ్ (చక్కెర) స్థాయిని పెంచుతుందని, మెదడు రక్తంలో గ్లూకోజ్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి సహాయపడుతుందని స్పష్టంచేశారు.

సీపీఐ నాయకులు కొప్పుల మృతి

విశాలాంధ్ర-విజయవాడ: సీపీఐ యనమలకుదురు శాఖ మాజీ కార్యదర్శి కొప్పుల కోటేశ్వరరావు అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పెనమలూరు నియోజకవర్గం కార్యదర్శి మున్నంగి నరసింహారావు, విజయవాడ నగర సహాయ కార్యదర్శి లంకా దుర్గారావు కోటేశ్వరరావు నివాసానికి చేరుకుని భౌతికదేహంపై ఎర్రజెండా కప్పి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ సీనియర్ నాయకులు పాము వెంకయ్య నేతృత్వంలో పార్టీ శాఖ సభ్యత్వం తీసుకున్నప్పటి నుండి ప్రజా సమస్యలపై పార్టీ పిలుపుమేరకు నిరంతరం పనిచేశారని గుర్తు చేశారు. యనమలకుదురు శాఖ కార్యదర్శిగా ఎదిగి అందరి మన్ననలు పొందిన కోటేశ్వరరావు అకాల మరణం పార్టీకి, ఆయన కుటుంబ సభ్యులకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. నగర కార్యవర్గ సభ్యులు దోనెపూడి సూరిబాబు, యనమలకుదురు శాఖ కార్యదర్శి వాటపల్లి ఇస్రాయిల్ ,కారే శేషగిరి, గురవయ్య, సజ్జ నాగమల్లేశ్వరరావు, గోవర్ధన్, సజ్జ దుర్గారావు, సయ్యద్ హుస్సేన్, వెంకటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

పసుపులేటి రామారావుకి పరామర్శ

విశాలాంధ్ర-తిరువూరు: సీపీఐ సీనియర్ నాయకుడు రేపూడి గ్రామానికి చెందిన పసుపులేటి రామారావు వారి ఇంటి దగ్గర కింద పడటంతో తుంటి బాగానే గాయాలు అవటంతో కదలలేని పరిస్థితిలో ఉండగా ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య, ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ సంఘం ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఎస్ కె నాగుల్‌మీరా ఆదివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

తుఫాన్ హెచ్చరికలతో అప్రమత్తం : ఎస్ఐ చంటిబాబు

విశాలాంధ్ర - గుడివాడ : మొంథా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో గుడివాడ రూరల్ మండల పరిధిలో ముందస్తు భద్రతా చర్యలలో భాగంగా ఆదివారం మోటూరు గ్రామంలో తాలుకా ఎస్.ఐ చంటిబాబు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కిరణ్‌కుమార్‌తో కలిసి గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై చంటిబాబు గ్రామ ప్రజలకు తుఫాను సంబంధిత జాగ్రత్తలపై సూచనలు తెలియజేశారు. తుఫాను సమయంలో ప్రజలందరూ అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రాకూడదని, విద్యుత్ తీగలు, చెట్లు, ప్రమాదకర ప్రదేశాలకు దూరంగా ఉండాలని, ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామ ప్రజలకు తుఫాను సమయంలో అవసరమైన అత్యవసర సేవల ఫోన్ నంబర్లు, రక్షణ కేంద్రాల వివరాలు తెలిపారు.

దావాజీగూడెం పంచాయతీ కార్యాలయం వెంటనే నిర్మించాలి

విశాలాంధ్ర-గన్నవరం : దావాజీగూడెం గ్రామపంచాయతీ కార్యాలయాన్ని వెంటనే పునర్నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ గన్నవరం నియోజకవర్గ సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం దావజీగూడెం పంచాయతీ కార్యాలయం పున్న నిర్మించాలని వామపక్షాలు పార్టీ ఆధ్వర్యంలో దావాజ గూడెం పామర్తి నగర్ సెంటర్లో సంతకాల సేకరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో రూ.60 లక్షలు మంజూరు చేసిందని, బాగున్న పంచాయతీ కార్యాలయాన్ని ధ్వంసం చేశారని, మూడున్నర సంవత్సరాలు గడుస్తున్న దాని మాట ఎత్తట్లేదని టిడిపి ప్రభుత్వం లోనైనా పంచాయతీ కార్యాలయాన్ని వెంటనే నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చాగంటిపాటి భవాని ప్రసాద్, కొండా వీరస్వామి, మాజీ ఎంపీటీసీ సభ్యులు తిరువీధి సుబ్బారావు, సీపీఎం కార్యదర్శి ఆంజనేయులు, మిరప నాగేశ్వరావు, సర్పంచి బడుగు మరియదాసు, పెయింటర్ వెంకటేశ్వరావు, యస్ కె అబూ, నాగర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ముందుచూపుతో సాగర్ ఆయకట్టు జలకళ

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ముందు చూపుతో నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్ లోని ఆయకట్టు చెరువులు ముందుగానే సాగర్ వరద జలాలతో నిండి జలకళ వచ్చిందని నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నాగార్జునసాగర్ ఎడమ కాలువ 3వ జోన్ చిట్టచివర ప్రాంతమైన వేంపాడు మేజరుకు సాగర్ వరద జలాలు చేరుకున్న నేపథ్యంలో ఆదివారం బాపులపాడు మండలం, కొత్తపల్లి గ్రామంలోని వేంపాడు మేజర్ 39 కి.మీ. దగ్గర నుంచి పొట్లకాయకుంట చెరువుకు విడుదల అవుతున్న సాగర్ వరద జలాలను మడిచర్ల డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ దేవినేని సత్యనారాయణ, బిళ్ళనపల్లి నీటి సంఘం అధ్యక్షులు కాకుమాను గోపి, బాపులపాడు మండలం టి.డి.పి. అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, కొత్తపల్లి గ్రామ టి.డి.పి. అధ్యక్షులు వల్లూరుపల్లి నానిలతో కలిసి పరిశీలించి సాగర్ జలాలకు పూలుజల్లి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆయకట్టుదారులు అక్కినేని రవికుమార్, పల్నాటి భాస్కరరావు, కోరం దానియేలు, ఎన్. ఎస్.పి. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.ఎస్.డి.జయరాజు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖరబాబు ప్రకటించారు. ఈనెల 27వతేదీ నుంచి 29వతేదీ వరకు వర్షాలతో పాట ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, పోలీస్ అధికారులు, సిబ్బంది అందరు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉన్న కారణంగా పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తెలిపారు.

రౌడీషీటర్లకు ఏసీపీ దుర్గారావు వార్నింగ్

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): రౌడీషీటర్లకు విజయవాడ వెస్ట్ ఏసీపీ దుర్గారావు వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం విజయవాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. శాంతి భద్రలకు విఘాతం కలిగించకుండా మెలగాలన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కార్యకలాపాలు పోలీసుల నిఘాలో ఉన్నాయని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఆర్థిక, భూ సెటిల్‌మెంట్లు వంటివి చేస్తూ సామాన్య ప్రజలపై దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తప్పు చేస్తే ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, ఇప్పటికే పలువురికి శిక్షలు విధించడం జరిగిందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో టూటౌన్ పోలీస్ స్టేషన్ సీఐ కొండలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సభలు జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాల నాగార్జునసాగర్ ప్రారంభించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏపీఆర్జేసీ సాగర్ పరివార్ ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏ.పీఆర్జేసీ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ డిసెంబర్ 13, 14వ తేదీల్లో నిర్వహిస్తున్నామన్నారు. గురుకుల జూనియర్ కళాశాలలో విద్యను అభ్యసించి నేడు సమాజంలో ఉన్నత పదవుల్లో ఉన్న పూర్వ విద్యార్థులు అందరూ ఈ వేడుకలకు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. డిసెంబర్ 13వ తేదీన గురువులకు సత్కారం,రాత్రికి క్యాంపు ఫైర్ నిర్వహిస్తున్నామ న్నారు. అలాగే 14వ తేదీన స్వర్ణోత్సవ సభ, ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జీవితంలో ఒక్కసారి మాత్రమే వచ్చే పూర్వ సమ్మేళనం లో చిన్ననాటి మిత్రులను, పాఠాలు చెప్పిన గురువులను కలిసే అవకాశం జారవిడుచుకోవద్దని పూర్వ విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్.శ్రీనివాస్, వీరన్న,బాల నాగేశ్వరరావు, సునీల్, రవిశంకర్,పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

బోధనేతర అధికారులతో విద్యావ్యవస్థ నిర్వీర్యం

-డీఈవో పదోన్నతుల్లో ఏడీలను మినహాయించాలి

-నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: విద్యాశాఖలో బోధనేతర అధికారులకు పదోన్నతులు కల్పించి నియమించడంతో విద్యా వ్యవస్థ నిర్వీర్యం అవుతోందని ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ ,మాగంటి శ్రీనివాసరావు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఒకేసారి మినహాయింపు క్రింద డీఈవోలు, డీడీలుగా పదోన్నతులు ఇప్పటికే పొందిన అసిస్టెంట్ డైరెక్టర్లకు పదోన్నతులు మినహాయించాలని కోరారు. ఈ నియామకాలతో ఇప్పటికే 40 శాతం మంది పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు వీడారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడ సాగించాలంటే విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని సూచించారు. నూతన జాతీయ విద్యా విధానం సిఫార్సులు పూర్తిస్థాయిలో అమలు చేయాలంటే బోధన అనుభవం ఉన్న ఉపాధ్యాయులను డైరెక్ట్ లెక్చరర్లు , విద్యాశాఖ అధికారులుగా నియమిస్తేనే విద్యా వ్యవస్థ బలోపేతం అవుతోందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు విద్యార్థుల అభివృద్ధి దృష్ట్యా పంచాయతీరాజ్ ప్రధానోపాధ్యాయులను ఉపవిద్యా శాఖ అధికారులుగా పదోన్నతులు కల్పించి 12.సైకిల్‌ను అమలు చేయటం ద్వారా వీరి నుండి జిల్లా విద్యాశాఖ అధికారులుగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

విశాలాంధ్ర- విజయవాడ: మొంథా తుపాను కారణంగా జిల్లాలో ఈ నెల 27వ తేదీ సోమవారం నిర్వహించవలసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 వ తేదీ నుండి 29 తేదీ వరకు భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని ఈ నేపథ్యం లో జిల్లా అధికారులు తో పాటు డివిజన్ మండల స్థాయి అధికారులు అందరూ క్షేత్ర స్థాయి లో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉన్న కారణంగా పి జి ఆర్ ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేశామని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాల్సిందిగా జిల్లా కలెక్టర్ కోరారు.

నమ్మండీ...ఇవి రోడ్లేనండీ...

విశాలాంధ్ర, విస్సన్నపేట : విస్సన్నపేట మండలంలో ప్రధాన రహదారులు అధ్వాన్నంగా మారి, రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లుతోంది. మండలంలో నూజివీడు నుంచి విస్సన్నపేట మీదుగా తిరువూరు వెళ్లే జాతీయ ప్రధాన రహదారిలో విస్సన్నపేటలోని మసీదు వద్ద గోతులమయంగా మారింది. దీనితోపాటు పుల్లేల రోడ్డులోని రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ప్రధాన రహదారిపై వెళ్లేందుకు వాహనదారులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఆర్అండ్‌బి పరిధిలో ఉన్న రహదారులను అధికారులు పట్టించుకున్న దాఖలాలు ఉండటంలేదు. ఏళ్ల తరబడి కనీస నిర్వహణ లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా విస్సన్నపేట నుంచి సత్తుపల్లి వెళ్లే రహదారి గాంధీబొమ్మ సెంటర్ సమీపంలో గోతుల మయంగా మారినా, పట్టించుకున్నవారు లేరు. ఎ.కొండూరు రోడ్డు వైఎస్సార్ విగ్రహం వద్ద రహదారి పరిస్థితి ఇంతే. మండలంలోని కొండపర్వ, కలగర గ్రామాల్లో పరిస్థితి గ్రామస్తులకు తలనొప్పిగా మారింది. కొండపర్వలో ప్రధాన రహదారి గోతుల మయంగా మారటంతో కనీసం నడచి రాకపోకలు సాగించేందుకు సైతం అవకాశం లేని పరిస్థితి తలెత్తుతోందని గ్రామస్తులు వాపోతున్నారు.

వాగ్ధానాలు అమలు చేయాలి : సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర -గంపలగూడెం : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్ధానాలను వెంటనే అమలు చేయాలని, గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు నివేశన స్థలాలు ఇచ్చి, గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గంపలగూడెంలో ఆదివారం జరిగిన సీపీఐ మండల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలలో గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు నివేశన స్థలాలు ఇస్తామని ప్రకటించారని, ప్రభుత్వం దానిని జీవో రూపంలో కూడా తీసుకొచ్చి, ఎక్కడ పంపిణీ చేయలేదని వెంటనే నివేసన స్థలాలు అందజేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తోటమాల-వినగడప గ్రామాల మధ్యనున్న కట్టలేరుపై బ్రిడ్జి 8 సంవత్సరాల క్రితం కూలిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే నేటికీ బ్రిడ్జి నిర్మాణం చేపట్టటం ఏమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని ఎన్నికల్లో హామీలు ఇచ్చి ఎన్నికల్లో గెలిచి 17 నెలలు పూర్తి అయిన నేటికీ అమలు చేయకపోవడం ఏమిటి అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నా యని వర్షాలకు చెరువులను తలపిస్తున్నాయని గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఈ ప్రభుత్వమైనా వెంటనే రోడ్లను బాగు చేయాలని కోరారు. ప్రజా సమస్యలపై ఈనెల 28వ తేదీన స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని, ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యులు చిలుకూరి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యం ప్రజలకు ఉచితంగా అందజేయాలని, కాని దానిని గాలికి వదిలేసి మెడికల్ కళాశాలలు ప్రైవేటుపరం చేసి వైద్యాన్ని పేదలకు అందకుండా దూరం చేస్తున్నారని ఆయన విమర్శించారు. రైతులకు ప్రభుత్వం రైతులకు రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అమలు చేయలేదని, పంటలకు గిట్టుబాటు ధర లేదని, పంటలకు గిట్టుబాడి ధర కల్పించాలని, పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్.నాగుల్ మీరా మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు విత్తనాలు, ఎరు వులు కూడా అందించలేనిస్థితిలో ఉందని యూరియాపై భారత కమ్యూనిస్టు పార్టీ ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఆందోళన కార్యక్రమాలు చేసినతర్వాత యూరియా పంపిణీ చేసారని ఆయన విమర్శించారు. ముందుగా భారత కమ్యూనిస్టు పార్టీలో మృతి చెందిన సురవరం సుధాకర్‌రెడ్డి, అనంత. లక్ష్మయ్యలకు మౌనం పాటించి సంతాపం తెలిపారు. సీపీఐ నాయకులు ఉన్నం సాంబశివరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల కార్యదర్శి గౌర్రాజు.రామకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్లకు వెళ్లిన హాస్టల్ విద్యార్థులు

విశాలాంధ్ర-కూచిపూడి : ఈ నెల 27 నుంచి 29 వరకు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవులను కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రకటిం చడంతో మొవ్వ మండలంలోని హాస్టల్ విద్యార్థులు వారి వారి ఇళ్లకు ఆదివారం వెళ్లారు. మొంథాతుఫానుతో ప్రాణ నష్టం జరగకుండా నివారించే ఉద్దేశంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశా లలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలు అన్నింటికి 3 రోజులు శెలవు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎస్సీ, బీ.సీ వసతిగృహాలలోని విద్యార్థులందరూ ఇళ్లకు వెళ్లే విధంగా చర్యలు చేపట్టారు.

ఇంటిబాటపట్టిన గురుకుల బాలికలు

విశాలాంధ్ర-చల్లపల్లి : మొంథా తుఫాను హెచ్చరికలతో ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలకు సెలవులు ఇవ్వటంతో చల్లపల్లిలో వసతిగృహాల్లో ఉంటున్న బాలబాలికలు ఇంటి బాట పట్టారు. ప్రధానంగా చల్లపల్లి గురుకుల పాఠశాల, కళాశాలలో బాలికలు మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఇళ్లకు బయలు దేరారు. తల్లిదండ్రులు చల్లపల్లి నారాయణరావునగర్లో ఉన్న గురుకుల విద్యాసంస్థకు వచ్చి తమ పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్లారు.

పాగోలులో సీసీ రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర -చల్లపల్లి : జిల్లాపరిషత్ నిధులతో చల్లపల్లి మండలం మేకావారిపాలెంలో సీసీ రహదారి నిర్మాణం చేపట్టారు. రూ.10 లక్షలతో గ్రామంలో మూడు సీసీ రహదారులు నిర్మిస్తుండగా, చల్లపల్లి జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి భూమిపూజ చేసి పనులు ప్రారంభించి పనులు పర్యవేక్షించారు. బీసీ కాలనీలో రహదారి నిర్మాణానికి కృషిచేసిన జడ్పీటీసీకి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీనివాసరావు, ప్రముకులు రాజులపాటి శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మొందా తుఫానుపై ముందస్తు జాగ్రత్తలు

విశాలాంధ్ర-పెడన: మొందా తుఫాను హెచ్చరికల నేపథ్యంలో పెడన మున్సిపాలిటీలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఉద్యోగులకు వంతులు వారీగా డ్యూటీలు వేశారు. కంట్రోల్ రూమ్ నెంబర్ 08672248340 తుఫానుతో సమస్యలు ఎదురైతే ఈ నెంబర్ కి ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించుకోవలసి ఉంటుంది. కాగా ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలను తరలించేందుకు కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం పట్టణంలో పర్యటించి నాలుగు పాఠశాలను ఎంపిక చేశారు. బట్ట జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రామలక్ష్మి వీవర్స్ కాలనీ ప్రాథమిక పాఠశాల, శివాలయం ప్రాథమిక పాఠశాల, వీరభద్రపురం ప్రాథమిక పాఠశాలలను కమిషనర్ ఎంపిక చేశారు. ఈ పాఠశాలను ఆయన తన స్వాధీనంలోకి తీసుకున్నారు. కాగా పట్టణంలోని డ్రైన్లలో మురుగు నీటి ప్రవాహాన్ని పరిశీలించిన కమిషనర్ పారిశుధ్య కార్మికులకు తగిన సూచనలు చేశారు.

రోడ్డుకు మరమ్మతులు

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడ శివారు చెరువుకొమ్ము నుండి వింజిరంపాడు గ్రామం వరకు సుమారు మూడు కిలోమీటర్లు ఆర్ & బి రోడ్డు పూర్తిస్థాయిలో శిథిలమై పెద్ద పెద్ద గుంతల పడి, రాళ్లు లేసి కొద్దిపాటి వర్షం కురిసిన నడవడానికి అవకాశం లేని పరిస్థితులలో, అలాగే వెంట్రప్రగడ జిల్ల పరిషత్ ఉన్నత పాఠశాలకు వింజనంపాడు గ్రామం నుండి విద్యార్థులు వెళ్లటానికి కనీసం ద్విచక్ర వాహనాలు కూడా నడవటానికి అనువుగా లేని సమయంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో రోడ్డు లెవెలింగ్ ను చేయించినట్లు ఒక ప్రకటనలో చలసాని తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంట్రప్రగడ పిఎసిఎస్ సొసైటీ అధ్యక్షుడు కూచిపూడి సుబ్బయ్య చౌదరి, పొనుగోటి సత్యనారాయణ, మంగ దొడ్డి శ్రీనివాసరావు, మాయల విజయబాబు, వెలగపూడి శ్రీనివాసరావు, చాకుమూరి ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదపూడి సచివాలయ భవనం ప్రారంభం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం పెదపూడి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు 43.60 లక్షల రూపాయలతో పాటు గ్రామపంచాయతీ నిధులు రూ.5 లక్షలతో కలిపి 48. 60 లక్షల రూపాయలతో నిర్మించిన సచివాలయ భవనం, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.23.94 లక్షలతో రైతు సేవా కేంద్ర భవనాలను ఆదివారం పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ప్రారంభించి భవనశిలాఫలకాలను, పంచాయతీ పాలకమండలి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని గురించి ప్రసంగించారు. గ్రామ సర్పంచ్ తాతా రజిని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వర రావు, ఏఎంసీ ఛైర్మన్ దోనేపూడి శివరామయ్య, కూచిపూడి పి.ఏ.సిఎస్. మాజీ అధ్యక్షులు తాతా రాంబాబు, తాతా ప్రభాకర రావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కందుల వెంకట కోటేశ్వరరావు (కొండలు), మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాసరావు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి వీరంకి తులసీదాసు, నాయకులు పాల్గొన్నారు.

భీమనది డ్రైన్ వద్ద వ్యర్థాలను 24 గంటల్లో తొలగించాలి

విశాలాంధ్ర-కూచిపూడి : భీమనది డ్రైన్ లో దట్టంగా అల్లుకుపోయిన గుర్రపుడెక్క, వ్యర్థాలను 24 గంటల్లో తొలగించాలని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా డ్రైనేజీ అధికారులను ఆదేశించారు. మొవ్వ మండలం పెదపూడి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ప్రభుత్వభవనాల ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన కూటమి నాయకుల కోరికపై భీమనది డ్రైన్ స్థితిగతులను పరిశీలించి అధికారులకు దీనిపై ఫోన్ ద్వారాసూచనలు ఇచ్చారు. ఈనెల 27 నుంచి (సోమవారం)మూడు రోజులపాటు కొనసాగేమొంథా తుఫాను కు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రైతులు ఏ విధంగానూ ఇబ్బందులు పడకుండా భీమనది, అయినంపూడి మేజర్ మురుగు కాలవలలో గుర్రపు డెక్క లేకుండా చూడాలని అధికారులకు ఫోను ద్వారా సూచించారు భీమనదిలో అల్లుకుపోయిన గుర్రపు డెక్క మూలంగా కూచిపూడి, పెదపూడి, యద్దనపూడి, కొండవరం, వేములమడ కోసూరు తదితర ప్రాంతాలలో వేలాది ఎకరాలు ముంపు పాలయ్యే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడుతూ అధికారులనుఅప్రమత్తం చేశారు. వెంటనే గుర్రపుడె క్కను తొలగించి రైతులకు తోడ్పాటునివ్వాలని ఆదేశించారు. ఈయనతో పాటు రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వర రావు, మొవ్వ ఎఎంసి ఛైర్మన్ దోనేపూడి శివరామయ్య, టిడిపి నాయకులు తాతా సత్యనారాయణ(నాని), తాతా ప్రభాకరరావు,మోటుపల్లి బసవయ్య, పరుచూరి సుధాకర్, గుత్తికొండ పద్మ జనసేన నాయకుడు రామిరెడ్డి రాజీవ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

విశాలాంధ్ర-అవనిగడ్డ: పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధా న్యత ఇస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలి పారు. ఆదివారం అవనిగడ్డ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ ఎఫ్) చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ 67 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.53,24,683 సహాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. ఇప్పటివరకు 21 విడతల్లో 749మంది లబ్ధిదారులకు రూ.5,58,59,304 సీఎంఆర్ఎఫ్ సహాయం అందజేశామని తెలిపారు. జనసేన పార్టీ నాయకులు మండలి వెంకట్రామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వికాస్, విద్యాలయ అధిపతులకు జాతీయ ప్రతిభా పురస్కారాలు

విశాలాంధ్ర-గుడివాడ : విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు, విద్యాలయ డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్‌లకు డా॥ ఎపిజె అబ్దుల్ కలామ్ జాతీయ పురస్కారాలు అందుకున్నారు. దక్షిణాది రాష్ట్రాలలో అత్యంత ప్రతిభావంతమైన వివిధ రంగాలలో నిష్ణాతులైన (సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ అసోసియేషన్) అబ్దుల్ కలామ్ జయంతిని పురస్కరించుకుని గుంటూరులో జరిగిన ఎ.పి.జె.అబ్దుల్ కలామ్ జాతీయ ప్రతిభా పురస్కారంలను విద్యా వికాస్, విద్యాలయ డైరెక్టర్లు సాంబశివరావు, విజయభాస్కర్‌లకు సంఘ గౌరవాధ్యక్షులు, మాజీ లక్ష్మణరావు అందజేశారు. సదరన్ ప్రైవేట్ లెక్చలరర్స్ రాష్ట్ర అధ్యక్షులు డా॥ నాగయ్య, టిడిపి రాష్ట్ర నాయకులు షేక్ వహీద్‌హుస్సేన్‌ల ఆధ్వర్యంలో అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎక్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లు చెరుకూరి శ్రీహరి,కన్నా పాల్గొన్నారు.

వీవీఐటీయూ బాలోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-పెదకాకాని: ప్రసిద్ధిగాంచిన ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీయూ బాలోత్సవ్ 2025 వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రాంగణంలో నవంబర్ 7 నుండి 9 వరకు మూడు రోజులపాటు వేడుకలు నిర్వహించనున్నట్లు ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. బాలోత్సవ్ సాంస్కృతిక ఉత్సవాలకు సంబంధించిన ప్రచార ప్రతులను ఆయన విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీయూ రిజిస్ట్రార్ డా.వై.మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్ డా.పవన్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకత నైపుణ్యాలను వెలికితీసేందుకు వివిఐటియు బాలోత్సవ్ ఒక మంచి వేదికని, ఇది వివిఐటియు నిర్వహించే 7వ బాలోత్సవ్ అని, విద్యార్థులలోని ఒత్తిడిని దూరం చేసి ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని కలగచేయటానికి బాలోత్సవ్ దోహదపడుతుందని అన్నారు. 2017 నుండి నిర్వహిస్తున్న వివిఐటియు బాలోత్సవ్ నందు పాల్గొను విద్యార్థుల సంఖ్య ప్రతిసంవత్సరం రెట్టింపు అవుతున్న సంగతి విదితమే. గత బాలోత్సవంలో రోజు పదివేల మంది బాలబాలికలతో వేడుకలు నిర్వహించామని ఈ సంవత్సరం అంతకన్నా అధికంగా విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ బాలోత్సవ్ ద్వారా తెలుగు సంస్కృతి, సాంప్రదాయం, విశిష్టత, ప్రాముఖ్యతను ముందు తరాలకు తెలియపరచవచ్చని అన్నారు. రిజిస్ట్రార్ డా. వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులలో పోటీతత్వం, నైపుణ్యం పెంపొందించేందుకు బాలోత్సవ్ కృషి చేస్తున్నదని, విద్యార్థులకు సాంస్కృతిక అంశాలతోపాటు, సాంకేతిక అంశాలలో కూడా బాలోత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నదని తెలిపారు. కళాశాలకు చెందిన ఎన్.ఎస్.ఎస్. ఎన్.సి.సి, శాక్ విద్యార్థులు బాలోత్సవ్ పాల్గొని చిన్నారులకు సహకారం అందిస్తారని తెలిపారు. బాలోత్సవ్ విద్యార్థి సంధానకర్త టి.నవ్య మాట్లాడుతూ మూడు రోజులపాటు 20 అంశాలు 60 విభాగాలుగా ఈ పోటీలు నిర్వహించనున్నామని, ప్రతి విభాగంలోను ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, రెండు ప్రత్యేక బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలలో వక్తృతం, తెలుగు పద్యం, తెలుగులోనే మాట్లాడుదాం. శాస్త్రీయ, జానపద నృత్యం, సంగీతం వంటి సాంస్కృతిక అంశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి ఈ వేడుకలకు విచ్చేయువారికి ఉచిత వసతి, భోజన సౌకర్యము కల్పించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ కొరకు వెబ్సైట్లో లోని గూగుల్ ఫారంను పూర్తిచేసి సబ్మిట్ బటన్ నొక్కటం ద్వారా అప్లోడ్ చేయవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు బాలోత్సవ్ సంధానకర్త నందిరాజు శివరామకృష్ణను 7386225336 నెంబర్ ద్వారా సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నేటి పీజీఆర్ఎస్ రద్దు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : మంతా తుఫాన్ దృష్ట్యా ఈ నెల 27న గుంటూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించవలసిన పీజీఆర్ఎస్ కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షాలు, గాలివానల సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 112 నంబర్ ద్వారా వెంటనే పోలీస్ సహాయం పొందవచ్చని తెలిపారు.

టీటీడీకి పది టన్నుల కూరగాయలు

విశాలాంధ్ర-తాడికొండ : మోతడక గ్రామ కాకతీయ కన్వెన్షన్ సొసైటీ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానంకు ఆదివారం పది టన్నుల కూరగాయలను వితరణ ఇచ్చారు. టీటీడీ వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రముఖ వైద్యులు యర్రా నాగేశ్వరరావు జెండా ఊపి లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కె.రమేష్ చంద్ర వారి మిత్ర బృందం, వృద్ధులు పాల్గొన్నారు.

ప్రేమలో వివిధ కోణాలు వీక్షించారు: రంగారావు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రేమలోని వివిధ కోణాలను కవులు చక్కగా ఆవిష్కరించారని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ రావి రంగారావు అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఎస్.హెచ్.ఓ)సమావేశ మందిరంలో తెలుగు కళావేదిక సమావేశం సంస్థ అధ్యక్షులు లంకా మాధవి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ప్రియుడు ప్రేయసి ప్రేమ మాత్రమే కాకుండా తల్లి ప్రేమ..సైనికుల మీద ప్రేమ..శ్రామికుల మీద..సంఘ సంస్కర్తల మీద.. దేశభక్తుల మీద కూడా ప్రేమను ఆవిష్కరిస్తూ కవులు ఎంతో వైవిధ్య భరితంగా కవితలు చదివారని కవులను మెచ్చుకున్నారు. నవ తరం, యువతరం ముందుకు రావాలని సంస్థ అధ్యక్షులు లంకా మాధవి పేర్కొన్నారు. ఉత్తమ కవిగా ఎంపికైన గడల శివప్రసాద్ను సంస్థ పక్షాన యర్రగుంట్ల పాండిరావు, లంకా మాధవి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజిక సేవకురాలు, కీర్తన ట్రస్ట్ అధ్యక్షురాలు, గ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత మేరిగ విజయలక్ష్మి, అద్దంకి ఉమా కుమారి, కృష్ణవేణి, సాంబశివరావు, సొపాటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల వనమహోత్సవం

విశాలాంధ్ర-మంగళగిరి : పెదవడ్లపూడి వై గార్డెన్లో మంగళగిరి రచ్చబండ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గ ఆర్యవైశ్య కార్తీక వన సమారాధన మహోత్సవం జరిగింది. సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వారి వ్రతాలు నిర్వహించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు, రచ్చబండ ఫ్రెండ్స్ సర్కిల్ వ్యవస్థాపకులు దేవతి భగవన్నారాయణ అన్న సమారాధన ప్రారంభించారు. రచ్చబండ ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధులు చీదెళ్ళ వాసు, నేరెళ్ల మురళి, బోజనపల్లి తాండవ, పసుమర్తి మురళి, కొలిశెట్టి రాము, మాజేటి సూర్య వేణుగోపాలకృష్ణ, రాంప్రసాద్, త్రిపురమల్లు సతీష్, గాదంశెట్టి రామకృష్ణ, వనమా కిరణ్, పువ్వాడ సతీష్ పాల్గొన్నారు.

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించి వెంటనే సుప్రీంకోర్టులో రిట్ పిటీషన్ వేయాలని కోరుతూ గుంటూరు కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్కు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు మాట్లాడుతూ టెట్పై ఉపాధ్యాయుల్లో భయాందోళనలు నెలకొన్నాయని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సుప్రీంకోర్టులో రిట్ పిటీషన్ వేయాలని, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి అవసరమైతే చట్ట సవరణ చేయాలని కోరారు. గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సాయి విశ్వనాథ్, ఎన్.భాస్కరరావు మాట్లాడుతూ అత్యవసరమైతే ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా సంవత్సరానికి మూడుసార్లు వారి సబ్జెక్టుల్లో మాత్రమే 40 శాతం మార్కులకు ఉత్తీర్ణత సాధించేలా టెట్ నిర్వహించాలని కోరారు. దీనికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్పందిస్తూ ఉపాధ్యాయులు టెట్ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ విషయం ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతానని, ఈ విషయంలో ప్రభుత్వం ఉపాధ్యాయ పక్షాన నిలుస్తుందని, టెట్ విషయంలో అనుకూలమైన నిర్ణయం తీసుకుంటుందని చెప్పినట్లు వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ గుంటూరు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పి.లలిత బాబు, ఉపాధ్యక్షులు ఏవీ కృష్ణారావు, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కూరపాటి రాజా, గుంటూరు నగర అధ్యక్షులు కేవీ రాఘవులు, ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు కె.వేణుగోపాల్, ఉపాధ్యక్షులు టి.రవి తదితరులు పాల్గొన్నారు.

సాలూరి రాజేశ్వరరావు చిరస్మరణీయులు

విశాలాంధ్ర-తెనాలి : సినీ సంగీత వినీలాకాశంలో ఒక విశిష్ట స్థానాన్ని పొందిన సంగీత సామ్రాట్ సాలూరి రాజేశ్వరరావు ప్రజల హృదయాలలో చిరస్మరణీయులని మహాత్మగాంధీ శాంతి ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి కొనియాడారు. తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మగాంధీ శాంతి ఆశ్రమంలో సాలూరి రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆదివారం తెనాలి కల్చరల్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఫిలిం సొసైటీ నిర్వాహకులు బొల్లిమంత కృష్ణ, ఓతుకోలు మార్కండేయులు, బోడా సుధాకర్, బెల్లంకొండ వెంకట్, కన్నెగంటి మౌనిక, కన్నెగంటి సుజాత పాల్గొన్నారు. గాయకులు వెంకట్, మౌనికలు సాలూరి స్వరపరచిన పాటలను గానం చేసి ఆయన సంగీతంలోని గొప్పతనంను వివరించారు.

డిశంబర్ 13,14 తేదీల్లో రాష్ట్ర స్థాయి మీట్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్. లాల్ వజీర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఎన్టీఆర్ స్టేడియం నందు గుంటూరు జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ మీట్ జరిగింది. ముప్పై సంవత్సరాల నుండి ఎనభై సంవత్సరాల వయస్సు గల 120 మంది మహిళలు, పురుషులు ఈ మీట్ లో పాల్గొన్నారు. వీరందరూ డిశంబర్ 13, 14 తేదీల్లో బాపట్లలో జరిగే రాష్ట్ర మీట్ కు అర్హులని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు షేక్. లాల్ వజీర్ పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే ఈ మీట్ లో మొదటి, ద్వితీయ స్థానాలు వచ్చిన వారు రాజస్థాన్ లోని గుల్బర్గ్ నగరంలో జరిగే మీట్ కు అర్హులని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కోటేశ్వరరావు, వై. లక్ష్మి, రాష్ట్ర సెక్రటరీ నజీర్, ఫ్లోరా, మస్తాన్ వలి, సురేష్, కిషోర్, శ్రీనివాస్, డాక్టర్ అబ్దుల్ ఖాదర్, మూర్తి, విజయ్, శేషయ్య, బాల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

కాకాని శివాలయంలో కార్తీకమాస సందడి

విశాలాంధ్ర-పెదకాకాని: కార్తీకమాసం మొదటి ఆదివారం పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో వేకువజామున నుంచే భక్తులు యజ్ఞాలబావి వద్ద కార్తీక పుణ్య స్నానాలు ఆచరించి భక్తి శ్రద్ధలతో ఆలయ ప్రాంగంలో ప్రదక్షణలు చేసి కార్తీకమాస దీపారాధనలు చేసుకున్నారు. శ్రీ మల్లేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకములు జరిపించుకున్నారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలుగకుండా ఆలయ ఉపకమీషనరు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. క్యూ లైనుల ద్వారా భక్తులకు స్వామి వారి దర్శనం తర్పితగతిన అయ్యే విధముగా క్యూలైనులు నడిపారు. కార్తీకమాస మొదటి ఆదివారము భక్తుల రాకతో ఆలయంలో కార్తీకమాస సందండి నెలకొంది. ఆలయ శానిటేషన్ విషయమై ఎప్పటికప్పుడు ప్రత్యేక శద్ధ వహించారు. ఆలయ ఉపకమీషనర్ గోగినేని లీలాకుమార్ నిత్య అన్నప్రసాదమును ప్రారంభించి భక్తులకు స్వయంగా వడించారు. అన్నప్రసాదము భక్తులు అధిక సంఖ్యలో స్వీకరించినారు. క్యూలైనులలో భక్తులకు ఉచితంగా పాలు, మజ్జిగ, తాగు నీరు అందించారు. చిలకలూరిపేట వాస్తవ్యులు హైకోర్టు న్యాయవాది పరికూటి సూర్య కిరణ్ కుమార్ దంపతులు నిత్య అన్నప్రసాదానికి రూ.50,116లు సమర్పించినట్లు ఆలయ ఉపకమీషనరు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు పొంగళ్లను శ్రీ స్వామి వారికి నివేదించుకొన్నారు. ప్రభలతో ప్రదక్షణలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్తీకమాస సాయం సంధ్య వేళ అర్చకస్వాములు ప్రత్యేక పూజలు అనంతరము కార్తీక ఆకాశ దీపమును ఏర్పాటు చేశారు. పోలీసు, ఫైర్, వైద్య, పంచాయతీ తదితర శాఖలు సేవలు అందించారు. పెదకాకాని పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసరు నారాయణస్వామి శాంతి భద్రతలను స్వయంగా పర్యవేక్షించి ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆదివారం వివిధ సేవా రుసుములు, అన్నదాన విరాళములు, ప్రసాద విక్రయం ద్వారా రూ.7,50,000లు ఆదాయము వచ్చినదని గోగినేని లీలాకుమార్ తెలిపారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో విజయనగరం జిల్లా లా అండ్ ఆర్డర్ ఎస్పీ, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

మొంథా తుఫాన్.. ఆందోళనలో రైతులు

విశాలాంధ్ర-తాడికొండ : మొంథా తుఫాన్ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం కురుస్తున్న వర్షాల వల్ల ఇప్పటికే వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికే పత్తి, వరి, జూటు పంటలు దెబ్బతిన్నాయి. తుఫాన్ హెచ్చరికలతో విద్యాసంస్థలకు మూడు రోజులపాటు సెలవు ప్రకటించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. తుఫాన్ కారణంగా ఏదైనా ఘటనలు జరిగితే రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

విశాలాంధ్ర-దాచేపల్లి : సాగర్ సిమెంట్స్ వ్యవస్థాపకులు సమ్మిడి వీరారెడ్డి జన్మదినం సందర్భంగా దాచేపల్లి నగర పంచాయతీ సహా గ్రామీణ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గతేడాది పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకున్న 36 మంది విద్యార్థులకు రూ.5.40 లక్షల నగదు చెక్కులను ఆదివారం అందజేశారు. ప్రథమ స్థానం సాధించిన వారికి రూ.20 వేలు, ద్వితీయ స్థానం పొందిన వారికి రూ.15 వేలు, తృతీయ స్థానం వచ్చిన వారికి రూ.10 వేల చొప్పున ఇచ్చారు. అదేవిధంగా నరసరావుపేటకు చెందిన రక్త నిధి కేంద్రం వారికి 85 మంది కర్మాగారం ఉద్యోగులు, కార్మికులు రక్తదానం చేశారు. గామాలపాడులోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ రెండు కార్యక్రమాల్లో కర్మాగారం వైస్ ప్రెసిడెంట్ సుబ్బారావు, ఎంపీడీఓ ఉల్లంగుల వెంకటేశ్వరరావు, కర్మాగారం ప్రతినిధులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మమ్మకు కాసు మహేష్ రెడ్డి పరామర్శ

విశాలాంధ్ర-దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లిలో మందపాటి లక్ష్మమ్మ ఆదివారం మృతి చెందారు. దాంతో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, పిడుగురాళ్ల గ్రామీణ జడ్పీటీసీ సభ్యుడు జంగా కోటయ్య ఆమె మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సాను భూతి తెలిపారు. అదేవిధంగా అన్ని పార్టీలకు చెందిన పలువురు నాయకులతో పాటు వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి ఆమెకు నివాళులర్పించారు.

నేడు పాఠశాలలకు సెలవు

విశాలాంధ్ర-దుర్గి : తీవ్ర వర్షాభావ నేపథ్యంలో పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు దుర్గి మండలంలోని అన్ని యాజమా న్యాల పాఠశాలకు సోమవారం సెలవు దినంగా ప్రకటించినట్లు ఎంఈఓ బెంజి మెన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు అందరూ గమనించి విద్యార్థులు ఎవ్వరూ పాఠశాలలకు రాకుండా వారి వారి తల్లిదండ్రులకు సమాచారం తెలియపర్చాలని కోరారు.

వాసవీ సేవా సమితి అధ్యక్షుడుగా సాతులూరి

విశాలాంధ్ర-దాచేపల్లి : వాసవీ సేవా సమితి దాచేపల్లి శాఖ అధ్యక్షుడుగా సాతులూరి సూర్యనారాయణ(సూరి) నియమితులయ్యారు. అదేవిధంగా ప్రధా న కార్యదర్శిగా కలవాల రమేష్, కోశాధికారిగా గుండా శంకరరావును ఎంపిక చేసినట్లు సమితి వ్యవస్థాపకులు గరిణే పుల్లారావు ఒక ప్రకటనలో తెలిపారు.

సరస్వతీ దేవీ విగ్రహం ఏర్పాటు

విశాలాంధ్ర-దాచేపల్లి : కేసానపల్లి కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఆదివారం సరస్వతీ దేవీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నారాయణపురానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యురాలు దివంగత తోట లక్ష్మీ జ్ఞాపకార్థం ఆమె భర్త, టీడీపీ సీనియర్ నాయకుడు తోట వెంకటేశ్వర్లు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆవిష్కరణ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తోట అరుణ, సరస్వతీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కోటా సాయన్నతో పాటు కూటమి నాయకులు పలువురు పాల్గొన్నారు.

కళాకారుల కార్తీక వనభోజనాలు

విశాలాంధ్ర-వినుకొండ: గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రవ్యాప్త కళాకారుల కార్తీక వనభోజనాలు కార్యక్రమం స్థానిక వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమంలో దాదాపు 200 మంది కళాకారులు పాల్గొన్నారు. కళాకారుల సభలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జి డి సి సి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవి మాట్లాడుతూ. కళాకారులకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని మరియు గుమ్మడి వృద్ధాశ్రమం గుమ్మడి కళా పీఠం ద్వారా గుమ్మడి దంపతులు సేవా దృక్పథం నో ఈ సందర్భంగా కొనియాడటం జరిగింది. మంచి పనులు చేస్తున్న గుమ్మడి కి మేము అండగా ఉంటామని ఆయన గత 25 ఏళ్లగా వినుకొండ నియోజకవర్గం మొత్తం సేవా కార్యక్రమాలతో తాను నిలిచిపోయేలాగా సేవ చేస్తున్నారని కొనియాడారు. ఆటల పోటీలు నందు పాల్గొన్న మహిళలకు చీరలు నాయకులు చేతుల మీదుగా అందజేశారు.

కల్తీ మద్యం నివారణకు 'సురక్ష' యాప్: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: నియోజకవర్గం బొల్లాపల్లి మండల కేంద్రంలో అక్రమ, కల్తీ మద్యం విని యోగాన్ని అరికట్టేందుకు, ప్రజా భాగస్వామ్యాన్ని పెంచే లక్ష్యంతో ఏపీ ఎక్సైజ్ సురక్ష మొబైల్ యాప్‌పై అవగాహన కార్య క్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజ నేయులు పాల్గొన్నారు. బొల్లాపల్లిలో వైన్ షాప్ వద్ద ఈ కార్యక్రమం జరిగింది. జీవీ మాట్లాడుతూ ప్రతి మద్యం సీసాపై ఉండే క్యూఆర్ కోడ్‌ను వినియోగదారులు తప్పనిసరిగా 'ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్'లో స్కాన్ చేసి, మద్యం నాణ్య తను తనిఖీ చేసుకోవాలని కోరారు. తద్వారా కల్తీ మద్యాన్ని గుర్తించడం, అక్రమ మద్యం అమ్మకా లను అరికట్టడం సాధ్యమవుతుందని తెలిపారు. కల్తీ మద్యం గురించి వినిపిస్తే కఠిన చర్యలు ఉంటా యని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

'మొంథా' తుఫాను ముంచుకొస్తున్న నేపథ్యంలో, తుఫాను ప్రభావిత ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. తుఫాను కారణంగా సంభవించే ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు అధి కారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిం చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. తుఫాను సమయంలో ఎవరూ బయటకు రావొద్దని జివి ఆంజనేయులు ప్రజలను కోరారు. అధికా రులు, విపత్తు నిర్వహణ సిబ్బంది ఇచ్చే సూచనలను తప్పక పాటించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం కంట్రోల్ రూమ్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.తుఫాను తీవ్రత, సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ, ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటామని ప్రభుత్వ చీఫ్ విప్ జివి ఆంజనేయులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

అడపా శ్రీనుకు అబ్దుల్ కలాం అవార్డు

విశాలాంధ్ర-గురజాల : స్టేట్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వ ర్యంలో ప్రతి సంవత్సరం అందజేస్తున్న అబ్దుల్ కలాం అవార్డును ఈ సంవత్సరం గురజాలకి చెందిన వికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ అడపా శ్రీనివాసరావుకు అందజేశారు.

ఆదివారం గుంటూరులోని రెవెన్యూ కళ్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో అడపా శ్రీనివాసరావుకు స్టేట్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ తరుపున సన్మానం చేసి అబ్దుల్ కలాం అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా అడపా శ్రీనివాసరావుకు మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, మేధావులు, రాజకీయ నాయకులు, వికాస్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

శివపార్వతి మ్యారేజ్ బ్యూరో కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-మాచర్ల : పట్టణంలోని పార్క్ సెంటర్‌లో రజక వృత్తిదారుల సంఘం డివిజన్ కార్యదర్శి బొడ్డుపల్లి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివపార్వతి మ్యారేజ్ బ్యూరో కార్యాలయాన్ని టీడీపీ సీనియర్ నాయక ులు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు ఆదివారం ప్రారంభించారు. యాగంటి మల్లికార్జునరావు మాట్లాడుతూ పట్టణంలో అన్ని సామాజిక వర్గాలకు వివాహ సంబంధాలు అందుబాటులో ఉండేలా బొడ్డుపల్లి ఈశ్వరయ్య మ్యారేజ్ బ్యూరో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈశ్వరయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. వివాహ సంబంధాలు కుదర్చటమే ఈ మ్యారేజ్ బ్యూరో స్థాపన లక్ష్యమని వెల్లడించారు.

గౌతంరెడ్డి, తేజస్వినిల రిసెప్షన్‌కు సీఎం రాక

విశాలాంధ్ర-వెల్దుర్తి : ఈ నెల 27న జరుగునున్న మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మారెడ్డి తనయుడు జూలకంటి గౌతంరెడ్డి తేజస్వినిల వివాహ రిసెప్షన్ మహోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఉదయం 10:30 గంటలకు వెల్దుర్తిలోని సబ్ స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో దిగనున్నారు. అనంతరం అదే ప్రాంతంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించి తిరిగి 11 గంటలకు వెళ్లనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా ఈ వేడుకలకు హాజరుకానున్నారు.

మెగా వైద్య శిబిరం ప్రారంభం

విశాలాంధ్ర-వినుకొండ: వరల్డ్ హార్ట్ డే మరియు బ్రెయిన్ స్ట్రోక్ డే సంద ర్భంగా వినుకొండ నియో జకవర్గం, బొల్లాపల్లి మండల కేంద్రంలో ఆది వారం శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అవగాహన ర్యాలీలో గుండె, మెదడు ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం, ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వైద్య నిపుణుల బృందం ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సలహాలు, మందులు అందించారు. జీవీ మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, జీవనశైలి మార్పుల ద్వారా గుండె జబ్బులు మరియు బ్రెయిన్ స్ట్రోక్ వంటి వాటిని నివారించవచ్చని తెలిపారు. ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ లిమక్కెన మల్లికార్జున రావు, వైద్య బృందం, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే కృషి ఎనలేనిది

విశాలాంధ్ర-పెదకూరపాడు : నియోజకవర్గంలో రోడ్ల నిర్మా ణానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఎనలేని కృషి చేస్తున్నా రని పెదకూరపాడు మండల టీడీపీ అధ్యక్షుడు ఏటుకూరు బ్రహ్మయ్య అన్నారు. ఆదివారం మండల టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్లంకొండ-అమరావతి రోడ్డు నిర్మాణానికి ఆర్థిక మంత్రి చొరవతో రూ.25 కోట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ నేత అత్తిమల రమేష్, బెల్లంకొండ రాంగోపాల్రావు, వడ్లమూడు అప్పారావు, చెన్నుపాటి బుల్లిబాబు, గల్లా బాబూరావు, భాష, ఆంజనేయులు, మద్దినేని వెంకట సత్యనారాయణ తెలిపారు.

సమాజహితానికి తోడ్పడాలి

విశాలాంధ్ర-దాచేపల్లి : ప్రతిఒక్కరూ సమాజహితానికి తోడ్పడాలని మత పెద్దలు ముస్లిం సోదరులకు పిలుపునిచ్చారు. ఆదివారం దాచేపల్లిలోని నూర్ మసీదులో మండల స్థాయి ఇస్తెమా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు మసీదు అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ జలీల్ అధ్యక్షత వహించారు. అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ముస్తఫా, మసీదు ఇమాం ముఫ్తీ ఆసిఫ్, ముతవల్లీ సైదావలి, మత పెద్దలు ఫారూఖ్, రఫీ, యూసుఫ్, యూనుస్, వసీం, అబ్దుల్ రహమాన్ తదితరులు మాట్లాడుతూ ప్రతి ముస్లిం సోదరుడు రోజూ ఐదు పూటలా నమాజు అలవర్చుకోవాలని, పరమత సహనాన్ని పాటించాలని, దానధర్మాలు చేయాలని కోరారు. అదేవిధంగా మసీదు ఇమామ్ ముఫ్తీ ఆసిఫ్ మాట్లాడుతూ మక్కా సందర్శన కోసం 15 రోజుల పాటు ఉమ్రా యాత్ర చేయాలని కోరారు. వచ్చే ఏడాది జనవరిలో జరిగే ఈ యాత్ర కోసం ఈ నెల 30 లోపు దరఖాస్తు చేయడం కోసం 8247771423 నంబరుకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మసీదు అభివృద్ధి కమిటీ సభ్యులు అమరావలి, పెద బ్రహ్మం, హాఫీజ్, లాలా, రహమాన్‌తో పాటు ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముద్దన హనుమంతరావు జీవితం ఆదర్శప్రాయం

కరణం బలరామకృష్ణ మూర్తి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నగరంలో నాలుగు దశాబ్దాలకుపైగా ప్రజల వైద్యుడిగా, ఆధ్యాత్మిక, సామాజిక, రాజకీయ నాయకుడిగా మానవీయ విలువలతో జీవించిన డాక్టర్ ముద్దన హనుమంతరావు జీవితం ఆదర్శప్రాయమని మాజీ పార్లమెంటు శాసనసభ సభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి కొనియాడారు. భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు గ్రంథస్తం చేసిన 'ప్రజల వైద్యుడు డాక్టర్ ముద్దన హనుమంతరావు' పుస్తకాన్ని స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం శ్రీ పద్మావతి కళ్యాణ వేదికపై బొల్లేపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న సరస్వతి విద్యాపీఠం జిల్లా అధ్యక్షులు వనమా పూర్ణచంద్ర రావు మాట్లాడుతూ సామ్యవాద దృక్పథంతో పాటు భారతీయ సంస్కృతి, చరిత్ర ఆదర్శాలను డాక్టర్ ముద్దన హనుమంతరావు ఆచరణలో చూపేవారన్నారు. గ్రంథ రచయిత డాక్టర్ వెన్నిశెట్టి సింగా రావు మాట్లాడుతూ ఉన్నత చదువులకు దూరంగా గ్రామీణ ప్రాంతానికి చెందిన తనలాంటి వారిని వెన్నుతట్టి ప్రోత్సహించిన నిష్కామక కర్మయోగి డాక్టర్ ముద్దన హనుమంతరావు అని ప్రశంసించారు. సభకు డాక్టర్ జి. సీతారామయ్య అధ్యక్షత వహించగా డాక్టర్ కొసరాజు రవీంద్రనాథ్, కొర్రపాటి రామారావు, పోలిశెట్టి జ్ఞానదేవ్ తదితరులు హనుమంతరావు సేవలను కొనియాడారు. సందర్భంగా బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, ఏలూరి సూర్యనారాయణ, డాక్టర్ పాకనాటి సూర్యకుమారి, సీహెచ్‌వై శ్రావణి సురేష్, ఇరుగులపాటి వేణుగోపాల్, ముక్తా ప్రభాకర్, పోతురాజు శ్రీనివాసరావు, డాక్టర్ హనుమంతరావు బంధువులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

అవసరమైతేనే బయటికి రండి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: మొంథా తుఫాన్ దృష్ట్యా రానున్న మూడు రోజులు అవసరమైతేనే ప్రజలు బయటికి రావాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా విజ్ఞప్తి చేశారు. మూడు రోజులకు అవసరమైన ఆహార సామగ్రిని ఇళ్లలో సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడే అవకాశాలు ఉన్నందున టార్చ్ లైట్స్, క్యాండిల్స్ సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. ఆదివారం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. మూడు రోజులపాటు ప్రభుత్వ ప్రైవేటు, విద్యాసంస్థలకు, పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 12 లోతట్టు ప్రాంతాలను గుర్తించామని వారికి అవసరమైతే తక్షణం పునరావాస కేంద్రాలకు తరలించుటకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. అన్ని శాఖలను పూర్తి అప్రమత్త చేశామని చెప్పారు. తాగు నీరుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

చంద్రబాబు పాలనపై బోడే రామచంద్ర యాదవ్ ఫైర్

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్రంలో జగన్ చేసిన తప్పులను మించి, చంద్రబాబు పాలన కొనసాగుతున్నట్లు బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మంగళగిరిలో మీడియాతో మాట్లాడుతూ జగన్ చేసిన తప్పుల కంటే పదింతలు ఎక్కువగా చంద్రబాబు తప్పులు చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు వేధింపులకు గురవుతున్నారని, పేదలు, మధ్యతరగతి ప్రాణాలతో ఆడుకుంటున్నారని అన్నారు. జగన్ హయాంలో లిక్కర్ కుంభకోణం జరిగితే చంద్రబాబు హయాంలో నకిలీ లిక్కర్ తయారు చేసి అమ్ముతున్నారని, షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్‌కి రూ.37 వేల కోట్లు కాంట్రాక్టులు కట్టబెట్టినట్లు, చంద్రబాబు హయాంలో రూ.69 వేల కోట్లు దోచిపెట్టారని విమర్శించారు. చంద్రబాబు పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించిన వారిపై అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతి కలిగిస్తున్నారని పేర్కొన్నారు. కరేడు రైతులు తమ భూములను రక్షించడానికి ప్రయత్నించగా వారిపై కేసులు పెట్టడం, రాత్రి పోలీసుల బెదిరింపులు జరగడం ఆగ్రహకరమని చెప్పారు. మహిళలు, మత్స్యకారులపై కూడా అక్రమ కేసులు పెట్టి భయపెట్టడం కొనసాగుతుందని అన్నారు. తనపై కేసులు పెట్టడం కొనసాగుతోంది. వైసీపీ హయాంలో తనపై 27 అక్రమ కేసులు పెట్టబడినట్టు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అదే విధంగా తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులు కలిగిస్తోందని, చంద్రబాబు రాక్షస పాలనకు ఇది నిదర్శనమని తెలిపారు. డీజీపీ ఇటీవల ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం తనపై ఉన్న కేసుల వివరాలను తక్షణమే ఇవ్వాలని చెప్పిన విషయాన్ని ఉదహరించారు. తనపై ఉన్న కేసులను బయటికి తీయాలని, ప్రజా సమస్యల కోసం ఎట్టి పరిస్థితుల్లో వెనకడుగు వేయవద్దని స్పష్టం చేశారు. బీసీ రక్షణ చట్టంపై చంద్రబాబు ప్రభుత్వం నోరు మెదపడం లేదని, టీడీపీలో ఉన్న బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రభుత్వంపై ఒత్తిడి వేయాలని రామచంద్ర యాదవ్ పిలుపునిచ్చారు. బానిస బ్రతుకులను వీడి ప్రజలకు క్షమాపణ చెప్పి పదవులకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

విజయవంతంగా 'నేషనల్ ఐపి యాత్ర-2025'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక నగరంపాలెం జిటి రోడ్డు శుభం హోటల్లో గత రెండు రోజులుగా జరుగుతున్న 'నేషనల్ ఐపి యాత్ర-2025' అత్యంత వైభవంగా ముగిసిందని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పారిశ్రామికవేత్తలు తమ సంతోషాన్ని వ్యక్తంచేశారు. కెవిల్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్, కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎమ్మెస్ఎంఈ స్కీమ్స్, పేటెంట్, కాపీ రైట్, డిజైనింగ్, జియోగ్రాఫికల్, ఇండికేషన్, ఐపి లీగల్, ఫ్రేమ్ వర్క్, ట్రేడ్ మార్క్, టెక్నాలజీ ట్రాన్స్ఫర్ అండ్ ఐపి, కమర్షియలైజేషన్ వంటి అంశాలపై నిష్ణాతులైన ఫ్యాకల్టీ సభ్యులతో అవగాహన కలుగజేశారు. రెండో రోజు ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ బ్యాంక్ ఎస్ఎంఈ విభాగం చీఫ్ మేనేజర్ సాహిత్య మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ సారధ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎంఎస్ఎంఈల ద్వారా అనేక పథకాలు ప్రవేశపెట్టి యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు బ్యాంకులను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. యువ పారిశ్రామికవేత్తలు సరైన ప్రాజెక్టు రిపోర్ట్స్ రూపొందించుకొని జాతీయ బ్యాంకులను సంప్రదించినట్లయితే సబ్సిడీలతో కూడిన రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. యువ పారిశ్రామికవేత్తలు మూస ధోరణులకు భిన్నంగా కొత్తకొత్త ఆలోచనలతో అంకుర పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలన్నారు. ముఖ్యంగా మహిళా యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు తక్కువ వడ్డీతో వారు ఎంచుకునే వ్యాపారం, పరిశ్రమను బట్టి రూ.5లక్షల నుండి రూ.20 కోట్ల వరకు రుణాలు అందిస్తున్నట్లు తెలియజేశారు. సభకు అధ్యక్షత వహించిన కేవల్ యూనివర్సిటీ ఇన్నోవేషన్ డైరెక్టర్ డాక్టర్ కె.రాఘవరావు మాట్లాడుతూ రెండు రోజుల సదస్సులో ఫెడరేషన్ ఆఫ్ స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ అధ్యక్షులు ఏపీకే రెడ్డి, ఎమ్మెస్ఎంఈ ఫ్యాకల్టీ ట్రైనర్ జె.కోటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి వై.నాగరాణి తదితరులు వివిధ అంశాలపై అవగాహన కలుగజేశారు. కార్యక్రమంలో బావా డెవలపర్స్ కే.శ్రీధర్ బాబు, ఫరెవర్ లివింగ్ ప్రొడక్ట్స్ టి.చంద్రశేఖర రావు, అమరావతి ఎంటర్‌ప్రైజెస్ టి.పావని, మహిళ యువ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు : మొంథా తుపాను తీవ్రస్థాయిలో ఉంటుందనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సూచించారు. ఆదివారం నియోజకవర్గం లోని రెవెన్యూ, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, వ్యవసాయ అధికారులతో చరవాణి ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రమాదాలను ముందస్తుగా అంచనా వేసి ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చూడాలన్నారు. అధికారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. తుఫాన్ ప్రభావం తగ్గే వరకు స్థానిక నాయకుల సహకారంతో సహాయ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వ్యవస్థలన్నీ నిర్వీర్యం

విశాలాంధ్ర-తాడేపల్లి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని ఎమ్మెల్సీ ఎం.హనుమంతరావు, వైసీపీ మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి, పట్టణ అధ్యక్షులు బురముక్కు వేణుగోపాలస్వామి రెడ్డి విమర్శించారు. ఆదివారం తాడేపల్లి పట్టణంలోని మహానాడు 23 రోడ్డు అధ్యక్షులు ఆర్.భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి సంతకాల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ ఆసుపత్రుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు సేకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పేదలకు ముఖ్యమైన విద్యా వైద్యాన్ని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారని, అందులో ఐదు మెడికల్ కాలేజీలు పూర్తి చేసి, క్లాసులు కూడా ప్రారంభించారని, మరో మూడు తుది దశకు చేరుకున్నాయని, వాటిని చంద్రబాబు పూర్తి చేయడానికి మనసు రాకపోగా వాటిని ప్రైవేటీకరణ చేయటానికి ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి చిన్న పోతుల దుర్గారావు, గుంటూరు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు మేడ వెంకటేశ్వరరావు (పండు), సయ్యద్ సలాం, మల్లికార్జున రెడ్డి, శరణ్ కుమార్ రెడ్డి, కళ్యాణ్, బాల కోటయ్య, భూపతి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణం: డైమండ్ బాబు

విశాలాంధ్ర-ఫిరంగిపురం: ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి పేరుతో ప్రైవేటీకరణ చేయడాన్ని వైఎస్ఆర్సిపి తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్‌బాబు) విమర్శించారు. మండలంలోని వేములూరు పాడు, ఫిరంగిపురంలోని వసంత నగర్‌లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డైమండ్ బాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రాష్ట్ర పాలనను అధోగతి పట్టించారని ఆరోపించారు. రాష్ట్రంలో ఒక పేదవాడు ఖరీదైన వైద్యం కోసం ఎంబిబిఎస్ చదవాలంటే అవకాశం లేకుండా చేశారని దుయ్యబట్టారు. టిడిపి పాలన విధానాలు నచ్చక ప్రజలు ఆగ్రహ జ్వాలలతో రగలిపోతున్నారని గుర్తు చేశారు. చంద్రబాబును నమ్మి ఓట్లేసి గెలిపించినందుకు నేడు మా పేద కుటుంబాలకు చుక్కలు చూపిస్తున్నాడని ప్రజలు మండిపడుతున్నారు. వైసిపి పాలనలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక సంకల్పంతో రాష్ట్ర ప్రజా సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లాలని మంచి సదుపాయాలు కల్పించి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తే అభివృద్ధిని ఓర్చుకోలేకే జగన్మోహన్ రెడ్డి పై కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని మండిపడ్డారు. చంద్రబాబు తనయుడు లోకేష్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఉద్దేశంతో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసి కోట్ల రూపాయలు కట్ట పెట్టేందుకు శ్రీకారం చుట్టారని వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోపోతే ప్రజల ఆగ్రహానికి గురవుతారని హెచ్చరించారు. వేములూరి పాడులో జరిగిన కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు వైసిపి నాయకుడు హబీబుల్లా ద్వారా డైమండ్ బాబు సమక్షంలో వైసీపీలో చేరారు. టిడిపి పాలన విధానాలు నచ్చక వైసీపీలో చేరినట్లు షేక్ ఆషా బి, షేక్ మున్ని అన్నారు. వైసీపీ నాయకులు మార్పులు శివరామిరెడ్డి, దాసరి కత్రినమ్మ, హేమలత రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, అమర్లపూడి రత్నం, కమలారెడ్డి, సయ్యద్ సైదులు (బుడే), దండే వెంకట్రావు, బొంబాయి శ్రీనివాస్ రెడ్డి, వేళంగిణి, మరియు కుమారి, చుక్క మీనాక్షి, షేక్ మస్తాన్ బి కార్యకర్తలు పాల్గొన్నారు.

నోటీసు

మహారాజశ్రీ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు మాచర్ల

O.S. No. 18 / 2022

బిట్వీన్ :
మామిడి పవన్ కుమార్ ....వాది.
మరియు
షేక్ ఖాసిం సాహెబ్ ...ప్రతివాది.

To,
షేక్ ఖాసిం సాహెబ్, తండ్రి. మస్తాన్, ముస్లిం, వ్యాపారం, R/o. డోర్ నెం.14-156/3, క్లాక్ టవర్ సెంటర్, చిన పీర్ సాహెబ్ స్ట్రీట్, చిలకలూరిపేట, పల్నాడు జిల్లా.

పై నెంబరు దావాను వాది ప్లెయింట్ పరిహారార్థం మీపై, పై దావాను దాఖలు చేసియున్నారు. పై నెంబరు దావాను గురించి నీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనడం లేదు. కనుక పై నెంబరు దావాలో మీకు గల అభ్యంతరములను, మీరు స్వయంగా గాని లేక శ్రీ కోర్టు వారి అన్ని ప్రశ్నలకు జవాబు ఇవ్వగల న్యాయవాది ద్వారా గాని ది.11.11.2025న పై కోర్టు వారి ఎదుట ఉ॥గం॥10:30ని॥లకు హాజరు కావలెయును. లేని యెడల దావాను మీ పరోక్షమున తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.

వాయిదా తేది. 11.11.2025
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

గంఢ్రకోట శ్రీనివాసరావు,
వాది తరపు న్యాయవాది, మాచర్ల-522426.

మహారాజశ్రీ ప్రిన్సిపుల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు మాచర్ల

O.S. No. 400 / 2018

బిట్వీన్ :
కాలం శ్రీనివాసరెడ్డి ....వాది.
మరియు
1. పగడాల మంగమ్మ
2. పగడాల అశోక్
3. పగడాల కృష్ణవేణి ...ప్రతివాదులు.

To,
ప్రతి వాదుల అడ్రసులు :
1. పగడాల మంగమ్మ,W/o.వెంకటేశ్వర్లు(లేటు)
2. పగడాల అశోక్ S/o.వెంకటేశ్వర్లు(లేటు)
3. పగడాల కృష్ణవేణి D/o.వెంకటేశ్వర్లు (లేటు)
పై ముగ్గురు ప్రతివాదులు పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం మరియు గ్రామ నివాసులు.

పై దావా ను వాది ప్రతి వాదులపై ప్రో నోటు ఆధారంగా డబ్బు వసూలు కొరకు దాఖలుచేసియున్నారు. శ్రీ కోర్టు వారు పై దావాను ది.28/10/2025న మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా వేసి యున్నారు. కావున ది.28/10/2025న పై దావాను ప్రతివాదులైన మీరు కోర్టు వారి ముందు హాజరు పడి, మీ యొక్క అభ్యంతరములను మీరు స్వయంగా లేక లాయర్ గారి ద్వారా గాని తెలుపు కొనగలరు. మీరు ది.28/10/2025న పై దావా నందు హాజరు పడని యెడల మీ పరోక్షమున దావా తీర్మానము చేయబడునని తెలియ జేయడమైనది.

వాయిదా ది.28/10/2025.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

షేక్ గాలిమ్ సాహెబ్ ,
వాది తరపు న్యాయవాది, మాచర్ల-522426.

సీపీఐ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు : సీపీఐ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు భైరాపట్నం రామకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అన్నారు. అచ్చంపేట మండల పరిధిలోని మాదిపాడు సీపీఐ శాఖ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, సంవత్స రన్న కాలంలో ప్రజలకి చేసింది ఏమి లేదని అన్నారు. మాటలు తప్ప మంత్రాలు పసలేదని అని అన్నారు. సీపీఐ కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాలలో సీపీఐ బలోపేతానికి కృషి చేసే విధంగా అన్ని వర్గాల ప్రజలు సమస్యలను అధ్యయనం చేసి అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యలు పరిష్కరించే దిశగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిపాడు శాఖ కార్యదర్శి ఎస్కే సుభాని, సిహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మూడు రోజులు విద్యా సంస్థలకు సెలవులు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: మొంథా తుఫాన్ దృష్ట్యా విద్యా సంస్థలకు ఈ నెల 27, 28, 29 తేదీల్లో మూడు రోజులు విద్యా సంస్థలు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలకు సెలవులను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తల్లిదండ్రులు చిన్నారులను బయటకు వదలరాదని కోరారు. ప్రజలు తుఫాను దృష్ట్యా ఇంటి వద్దనే ఉండాలని పిలుపునిచ్చారు. తుఫానుకు పూర్తి అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 0863 2234014 ఏర్పాటు చేశామని, దీంతో పాటు డివిజన్, మండల స్థాయిలోనూ కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేశామని చెప్పారు. తుఫానుకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు తెలియజేయవచ్చని, అలాగే సమాచారాన్ని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ ఎస్)ను కూడా రద్దు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. తుఫాన్ దృష్ట్యా ప్రజలు వ్యయ ప్రయాసలతో పీజీఆర్ఎస్‌కు రావద్దని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కమిషనర్

విశాలాంధ్ర-మంగళగిరి : మొంథా తుఫాన్ ముప్పు నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ అలీం బాషా సూచించారు. లోతట్టు, కొండ ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. కొత్తపేట, ఇందిరానగర్, సీతానగరం, ఉండవల్లి ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వర్షాల నేపథ్యంలో శానిటేషన్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. అత్యవసర సహాయం కోసం ప్రత్యేక కాల్ సెంటర్ నంబర్లు 7093912653, 08645-295193 అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గవాయ్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు : భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ మీద దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని, ఈ దాడి వెనుక ఉన్న శక్తులను, వ్యక్తులను గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నవంబరు 1వ తేదీన ఛలో హైదరాబాద్ కార్యక్రమం జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్ దుద్దు రామకృష్ణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు దాసరి నాగయ్య మాస్టారు, ఎంఎస్‌పీ జిల్లా కోశాధికారి కంచర్ల జాన్ బాబు మాదిగ, ఎంఎస్‌పీ నియోజకవర్గ అధ్యక్షులు వేమవరపు జీవన్ మాదిగ, అన్ని మండలాల నాయకులు వెంకటస్వామి, అచ్చయ్య, కృపారావు, కిరణ్, కార్యకర్తలు దయాకర్, నాగరాజు, అశోక్, బాబురావు, శ్రీను, రాజు, సురేష్ పాల్గొన్నారు.

తుపాను నష్ట నివారణకు చర్యలు: మేయర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: మొంథా తుఫానును గుంటూరు నగరంలో సమర్ధవంతంగా ఎదుర్కొని ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా సిద్దంగా ఉండాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. ఆదివారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మొంథా తుఫాన్ వలన ఇబ్బందులు కలగకుండా నగరంలో తీసుకోవలసిన ముందస్తు చర్యలపై కార్పొరేటర్లు, అధికారులు, సచివాలయ కార్యదర్శులతో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అత్యవసర అమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలో ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనుటకు అధికారులు మరియు కార్యదర్శులు సిద్దంగా ఉండాలన్నారు. హుద్ హుద్ వంటి ప్రమాదకర తుఫానులు వచ్చినప్పుడు సమర్ధవంతమైన నాయకత్వం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇబ్బంది లేకుండా సత్వర చర్యలు తీసుకున్నారని వారి నాయకత్వంలో ప్రస్తుత తుఫానును కూడా ఎదుర్కొందామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ రానున్న మూడు రోజులు అధికారులు, కార్యదర్శులలో ఏ ఒక్కరికి సెలవులు లేవని ప్రతి ఒక్కరు విధులు కేటాయించిన ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందేన్నారు. రెండు వార్డులకు ఒక ప్రత్యేక అధికారితో కూడిన సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ (0863-2345103, వాట్సప్ నెంబర్ 9849908391) నగర పాలక సంస్థ కాన్ఫరెన్సు హాల్‌లో ఏర్పాటు చేశామని, క్షేత్ర స్థాయిలో ఏ విపత్కర పరిస్థితిని గుర్తించినా వెంటనే కంట్రోల్ రూమ్‌కి సమాచారం అందించాలన్నారు. సచివాలయం పరిధిలో పునరావాస కేంద్రాల ఏర్పాటుకు నోడల్ ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాన్ ముందస్తు, తదుపరి చర్యలలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, అవాంచనీయ సంఘటనలు జరిగితే సంబంధిత అధికారి, కార్యదర్శులే బాధ్యత వహించాలన్నారు. ఏపీ హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్ బాషా, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, టి. వెంకటకృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఇంచార్జ్ యస్.ఈ సుందర్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రధాత స్టాలిన్ బాబు



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : విద్యార్థి, యువజన నేతగా గొప్ప పేరు తెచ్చుకుని అనేకమందికి స్ఫూర్తిగా నిలిచిన స్టాలిన్‌బాబు మృతి అభ్యుదయ ఉద్యమాలకు, ప్రజాతంత్ర వాదులకు తీరనిలోటు అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో విచారం వ్యక్తంచేశారు. వామపక్ష ఉద్యమంలో చురుకుగా పాల్గొని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా వేలాది ఉద్యమాలు నిర్వహించిన స్టాలిన్‌బాబు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు జరిగిన ఉద్యమంలో అగ్రస్థాయిలో నలిచి స్టీల్‌మెన్‌గా పిలువబడ్డాడని కొనియాడారు. కమ్యూనిస్టు పార్టీలోని అగ్రనాయకులందరితో కలిసి పని చేసిన స్టాలిన్‌బాబు పార్టీ నిర్వహించే రాజకీయ పాఠశాలలో అధ్యాపకుడిగా మార్క్సిజం లెనినిజం బోధించి చాలా మంది కమ్యూనిజం వైపు ఆకర్షితులయ్యేలా చేశారని, ఆరోజుల్లో జరిగిన ప్రతి ప్రజా ఉద్యమంలో స్టాలిన్‌బాబు పాత్ర ఉందన్నారు. అటువంటి పోరాట యోధుడ్ని కోల్పోవటం బాధాకరమని, అవగాహన సంస్థ అంటే అభిమానంగా ఉండేవారని, కార్యక్రమాలను ప్రోత్సహించేవారని పేర్కొన్నారు. సంస్థ సభ్యులతో స్టాలిన్‌బాబుది విడదీయరాని సంబంధం ఉందని కొండా శివరామిరెడ్డి వెల్లడించారు.

మరువలేని సంగీత సారథి సాలూరి

విశాలాంధ్ర-తెనాలి : మదిలో వీణలు మ్రోగే... ఆశలన్నీ చెలరేగే, నీవులేక వీణ పలుకలేనన్నది, మ్రోగింది కళ్యాణ వేళ, ఈ రేయి తీయనిది, ఖుషి ఖుషీగా నవ్వుతూ ఇలా ఏ పాట విన్నా గాల్లో తేలిపోవాల్సిందేనని అదే సాలూరు రాజేశ్వరరావు ప్రత్యేకత అని వక్తలు నివాళులర్పించారు. తెనాలి గాంధీనగర్ ఇస్మాయిల్ సమావేశ హాలులో అభ్యుదయ కళా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాలూరి రాజేశ్వరరావు వర్ధంతి సభ జరిగింది. సభకు రంగస్థలం కళాకారుల సంఘం తెనాలి కార్యనిర్వాహక అధ్యక్షులు గరికపాటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. సభకు కళా సమితి కార్యదర్శి బెల్లంకొండ వెంకట్ స్వాగతం పలికారు. అరసం జిల్లా అధ్యక్షులు కనపర్తి మాట్లాడుతూ సాలూరి సంగీతం సాలూరి వారి సొంతం అని జీవిత విశేషాలను వివరించారు. సంగీత ప్రొఫెసర్ కళ్యాణి మాట్లాడుతూ సాలూరి వారి ఒక్కొక్క పాట ఒక్కొక్క ఆణిముత్యం అని వారి బాటలో నేటితరం ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. నటుడు దర్శకుడు పాతూరి సుబ్రహ్మణ్యం, భీమేశ్వర ప్రసాద్, రచయిత ఆళ్ల నాగేశ్వరరావు, ఎంపీ రఘునాథరావు, దేవరపల్లి నీలాంబరం, బొల్లిమంత కృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో ఓతుకోలు మార్కండేయులు, బోడా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ప్రారంభంలో సాలూరి రాజేశ్వరరావు చిత్రపటానికి సంగీత కళాకారులు గాయకులు పూలమాలతో స్మృత్యంజలి ఘటించారు. సభలో గాయకులు చిరంజీవి కన్నెగంటి మౌనిక, కళ్యాణి, నీలాంబరం విజయసారథులు రాజేశ్వరరావు స్వర రచనలో గీతాలు గానం చేశారు.

బీటీ రోడ్డు భారీ గుంతకు మరమ్మతులు

విశాలాంధ్ర-మంగళగిరి: యర్రబాలెం నుంచి ఏపీ సచివాలయం వైపు వెళ్లే బీటీ రహదారిపై ఏర్పడిన భారీ గుంతకు మరమ్మతులు చేపట్టారు. బీటీ రహదారిపై భారీ గుంత... ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు.. అంటూ ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వచ్చిన కథనంపై స్పందించారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ అధికారులు యుద్ధప్రాతిపదికన భారీ గుంతకు మరమ్మతులు చేపట్టారు. తమ రాకపోకల ఇబ్బందులను తీర్చిన పలువురు వాహనదారులు, స్థానిక ప్రజలు మంత్రి నారా లోకేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీలో 26 సంఘాల చేరిక

భానుజి రావు వెల్లడి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల హక్కులు, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీలోకి వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సుమారు 26 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘాలు అనుబంధంగా చేరాయని జేఏసీ ఛైర్మన్ దూసి భానుజి రావు తెలిపారు. ఈ చేరికతో రాష్ట్రంలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యమశక్తి మరింతగా బలోపేతమైందన్నారు. గుంటూరులోని అగ్రికల్చర్ మీటింగ్ హాలులో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. భానుజి రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భానుజి రావు మాట్లాడుతూ హార్టికల్చర్, అగ్రికల్చర్, మార్కెటింగ్ డిపార్ట్మెంట్, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖ, హార్టికల్చర్ యూనివర్సిటీ, ఐసీడీఎస్, మెడికల్ డిపార్ట్మెంట్, రిమ్స్ హాస్పిటల్, మార్కెటింగ్ యార్డ్, కాఫీ బోర్డు, మున్సిపాలిటీ, ఇరిగేషన్ డిపార్ట్మెంట్, ఐఅండ్‌పీఆర్, హౌసింగ్ డిపార్ట్మెంట్, అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, బీసీ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, గ్రంథాలయ శాఖ, మైన్స్ డిపార్ట్మెంట్, విజిలెన్స్ డిపార్ట్మెంట్, డ్రైవర్ అసోసియేషన్లు, ఆడిట్ డిపార్ట్మెంట్, హౌసింగ్ డిపార్ట్మెంట్‌తో సహా పలు కీలక శాఖలకు చెందిన సంఘాలు ఏకమై జేఏసీలో భాగమయ్యాయన్నారు. రాబోయే రోజుల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్ నెరవేరే వరకు కృషి చేయాలని, మరిన్ని సంఘాలను జేఏసీలోకి ఆహ్వానించాలని నిర్ణయించారు. తమ డిమాండ్ల సాధనలో భాగంగా రాష్ట్రం లో మొదటి కార్యక్రమంగా విజయనగరం జిల్లాలో 'మహజనసభ' బహిరంగ సభను నిర్వహించాలని నిర్ణయించారు. నవంబర్‌లో జరగబోయే ఈ కార్యక్రమానికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిస్తూ, దీనికి సంబంధించిన గోడపత్రి కను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్నాథ్, వైస్ ప్రెసిడెంట్ కేవై దివాకర్ బాబు, కోశాధికారి అనిల్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.మహేంద్ర బాబు, వరప్రతాప్, ఓబులేష్, కృష్ణ, సుబ్బారాయుడు, కిషోర్, ఆర్చివ్స్ శాఖ రవి కుమార్ పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో కోచ్ స్ ఓరియంటేషన్ ప్రోగ్రాం

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న కోచ్ల ఓరియెంటేషన్ కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని శాప్ చైర్మన్ ఏ. రవి నాయుడు, వైస్ చైర్మన్ %d% మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. భరణి ఐఏఎస్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యువత అభివృద్ధి క్రీడా ప్రతిభా ప్రోత్సాహం పట్ల అత్యంత నిబద్ధతతో పనిచేస్తోందన్నారు. మన లక్ష్యం 2029 నాటికి ఆంధ్రప్రదేశను దేశ క్రీడా రాజధానిగా, అంతర్జాతీయ క్రీడా ప్రతిభా కేంద్రంగా తీర్చిదిద్దడమన్నారు. ఈ దిశగా కోచ్ ల పాత్ర కీలకమైంది" అని అన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి రాష్ట్రవ్యాప్తంగా మొదటిసారిగా శాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమ అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుందని ఆయన తెలిపారు. శాప్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. భరణి ఐఏఎస్ మాట్లాడుతూ, "ఈ కార్యక్రమం ద్వారా శాప్ కోచ్లు సాంకేతిక, నైతిక, శాస్త్రీయ పరమైన దృక్పథంతో మరింత అభివృద్ధి చెందాలన్నారు. తమ శిక్షణ పద్ధతుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా క్రీడా సంస్కృతిని వ్యాప్తి చేయాలన్నారు. ఇది కేవలం ఒక శిక్షణా శిబిరం కాదు శాప్ భవిష్యత్తు విజయాలకు బాటలు వేయు కార్యక్రమం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాప్ ఏ.ఓ. వెంకట రమణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రిసోర్స్ నిపుణులు, రాష్ట్రవ్యాప్తంగా 132 మంది కోచ్లు, 26 జిల్లాల డిఎస్డిఓలు శాప్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ మూడు రోజుల కార్యక్రమంలో కోచ్లకు సాంకేతిక నైపుణ్యాలు, ఆధునిక శిక్షణా విధానాలు, మరియు క్రీడా పాలనసంబంధ అంశాలపై శాప్ నిపుణులు ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు.

షూటర్ ముఖేష్ కు ఘన సత్కారం

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఇటీవల ద నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఢిల్లీ ఆధ్వర్యంలో జరిగిన జూనియర్ వరల్డ్ కప్ షూటింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో ఒక బంగారు పతకం ఒక రజత పతకం సాధించిన ముఖేష్ ను ద ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ డైరెక్టర్ అండ్ చీఫ్ కోచ్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వర రావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ శివ ప్రసాద్ మాట్లాడుతూ మన రాష్ట్రానికి జూనియర్ వరల్డ్ కప్ లో పతకాలు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. అకాడమీ డైరెక్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మన రాష్ట్రానికి మరిన్ని అంతర్జాతీయ పథకాలు సాధించి ఒలంపిక్ పథకాన్ని కైవసం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, అకాడమీ షూటర్స్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి భారీ చేరికలు

విశాలాంధ్ర - గుడివాడ : ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సిద్ధులు నచ్చి జనసేనలోకి వివిధ పార్టీలకు చెందిన నాయకులకు జనసేన ఇన్‌ఛార్జి బూరగడ్డ శ్రీకాంత్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆదివారం స్థానిక భాస్కర్ థియేటర్ రోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ 30 మందికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 31వ వార్డుకు చెందిన 30 మంది జనసేనలో చేరేందుకు పార్టీ నాయకుడు వేమూరి త్రినాథ్ చొరవతో రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, నాయకులు సాయన రాజేష్, పదాల పూర్ణ, ఇమ్మిడిశెట్టి భాను, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కోటి సంతకాల మాయ మాటలు నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరు

ప్రజల్లోకి మళ్లీ రావాలని జగన్ అసత్య ప్రచారాలు

దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-అవనిగడ్డ: వైసీపీ చేస్తున్న కోటి సంతకాల మాయ మాటలను ప్రజలు నమ్మేందుకు సిద్ధంగా లేరని దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం అవనిగడ్డ పంచాయతీ పరిధిలోని లంకమ్మమాన్యం కాలనీలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ప్రారంభించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం గురించి అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కోటి సంతకాల కార్యక్రమంలో వైసీపీ నాయకులు స్వయంగా సంతకాలు పెట్టుకుని వెళ్లడమే తప్ప, ప్రజలు ఎవరూ స్పందించలేదని ఆయన విమర్శించారు. ప్రజలు వైసీపీ అసత్య ప్రచారాలకు భయపడే రోజులు పోయాయని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ప్రజల్లోకి రావాలని అబద్ధాలతో ప్రయత్నిస్తున్నారని కొల్లూరి వెంకటేశ్వరరావు మండిపడ్డారు. పిపిపి విధానం కొత్తది కాదని, గతంలోనే మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, అటల్ బిహారీ వాజ్‌పేయ్ హయాంలో ఈ విధానం ద్వారా దేశవ్యాప్తంగా హైవే రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. తండ్రి పేరు చెప్పుకుని ఒక్క అవకాశం ఇవ్వమని అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సర్వనాశనం చేశాడని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ప్రజలందరూ సంతోషంగా, సురక్షితంగా జీవిస్తున్నారని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ విదేశీ పెట్టుబడులు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని కొల్లూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ కోడూరు మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, బండే రాఘవ, ఘంటసాల రాజామోహనారావు, పర్చూరి దుర్గాప్రసాద్, మేడికొండ విజయ్, మండలి రామమోహనారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రీజనల్ మాథ్స్ ఒలింపియాడ్‌లో అర్హత సాధించిన డా॥కెకెఆర్ గౌతమ్ 17 మంది విద్యార్థులు

విశాలాంధ్ర-గుడివాడ : ఇటీవల మాథ్‌మెటిక్స్ టీచర్స్ అసోసియేషన్(ఇండియా) నిర్వహించిన ఒలింపియాడ్ క్వాలిఫైర్ ఇన్ మాథ్‌మెటిక్స్ పోటీ పరీక్షల్లో కెకెఆర్ గౌతమ్ స్కూల్ 17 మంది విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి సెకండ్ లెవల్ ఆర్ఎంఒకు అర్హత సాధించినట్లు ఫాక్స్ స్కూల్ ప్రిన్సిపల్ ఎం.రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులు డి.కీర్తనరెడ్డి, ఎం.నీరజ్‌కుమార్, డి.వ్యాగీస్‌చౌదరి, వి.హేమసాయి సిద్ధార్థ్, బి.గురుదీపక్‌రెడ్డి, షేక్ సాజిద్‌రిహాన్, ఎ.కార్తిక్‌రెడ్డి, డి.రిషితరెడ్డి, కె.నిహాల్‌రెడ్డి, జి.జయఅభిరామ్, కె.ప్రేమ్‌చంద్, ఎం.వి భవ్యతేజ, పి.మోహిత్‌వెంకటసుభాష్, పి.ప్రణీత్‌రెడ్డి, డి.తేజిత్‌నాయుడు, వి.ఆనంద్‌కాశీ వైష్ణవ్‌రెడ్డి, జి.రెడ్డిపునీత్‌యాదవ్‌లు నవంబర్ 16న జరిగే 2వ లెవల్‌కు ఎంపిక అయినట్లు తెలిపారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులను పాఠశాల అవరణలో పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

గ్యార్మీ ఫంక్షన్‌కి విరాళం

విశాలాంధ్ర,మైలవరం : ఎన్టీఆర్ జిల్లా, మైలవరం మండలం,మైలవరం లోని జండా చెట్టు వద్ద ముస్లిం సోదరులు నిర్వహించు గ్యార్మీ పంక్షన్ కు ఆదివారం తెలుగు యువత అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కులమతాలకు అతీతంగా ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా జరుపుకునే గ్యార్మీ పంక్షన్ కు హాజరైన తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ స్ఫూర్తితో తన సొంత నిధుల నుండి ముస్లిం సోదరులకు రూ. 10,000/-లను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల పార్టీ సెక్రటరీ దూరు బాలకృష్ణ, టౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కరీం దాదా, టౌన్ సెక్రటరీ వేమల. అంకరాజు, మల్లెల రాధాకృష్ణ,ఎక్స్ వైస్ ప్రెసిడెంట్ షాహినా బేగం, షేక్ బాజీ, మహమ్మద్. దత్తు, షేక్ సుభాని, షేక్ మమ్ము, పరికల సాంబయ్య, షేక్ మస్తాన్, కోసూరి అంజి,మైక్ బాబురావు, నూతక్కిసతీష్, తమ్ముడ్రు.ఎలిజర్, షేక్ దాదార్,తెలుగు యువత, తదితరులు పాల్గొన్నారు...

టీటీ ఏపీ ర్యాంకింగ్‌లో పతకాలు

- మూడు రజత, ఒక కాంస్యం కైవసం

విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్ : ఏలూరులో అక్టోబర్ 24వ తేదీ జరిగిన యూటీటీ ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ లో దామస్ టీటీ అకాడమీ క్రీడాకారులు పలు పతకాలు సాధించినట్లు అకాడమీ కోచ్ వై.దామోదర్ రెడ్డి తెలిపారు. బాలుర అండర్ 15 విభాగంలో జి.లోహిత్ రజత పతకం, బాలుర అండర్ 13 విభాగంలో యశ్వంత్ రజత పతకం, బాలికల అండర్ 11 విభాగంలో జి.మహి మన్విక రజత పతకం, జి.మిషిక కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. వీరు పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య నగర పాలక సంస్థ ఇండోర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా విజేతలను కృష్ణాజిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈ.రామిరెడ్డి, వి.భార్గవి, కోశాధికారి ఎ.రామచంద్రరావు, వీఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ డా.ఎ.శ్రీధర్, శిక్షకులు స్వపన్ గంగోపాధ్యాయ, తదితరులు అభినందనలు తెలిపారు.

నాణ్యమైన విద్య, శిక్షణ ఫలితంగానే ఉద్యోగాలు

విద్యార్థుల కృషి పట్టుదలతోనే విజయాలు సాధ్యమవుతాయి

విశాలాంధ్ర-తిరువూరు: శ్రీ వాహిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, తిరువూరులో శనివారం జరిగిన టెస్ట్ సిరీస్ ప్రో క్యాంపస్ డ్రైవ్‌లో 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ క్యాంపస్ డ్రైవ్ ప్రత్యేకంగా 2026 పాస్‌అవుట్ బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం నిర్వహించబడింది. ఇంటర్వ్యూల ప్రక్రియలో భాగంగా కంపెనీ ప్రతినిధులు మొదటగా ప్రీ ప్లేస్‌మెంట్ టాక్, అనంతరం టెక్నికల్ మరియు హెచ్.ఆర్. రౌండ్లు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఎంపికైన 15 మంది విద్యార్థులకు 3 లక్షల నుండి 8 లక్షల వరకు వార్షిక జీత ప్యాకేజీలు లభించాయి ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీ డాక్టర్ రంగా నాగేంద్రబాబు, శిక్షణ మరియు ఉపాధి అధికారి షేక్ షరీఫ్, ఎం. హెచ్. సత్యప్రసాద్ ఎంపికైన విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందించారు. కళాశాల శ్రీ ఊటుకూరు సుబ్రమణ్యం, కరస్పాండెంట్ శ్రీ పొట్లు నాగేశ్వరరావు, కోశాధికారి శ్రీముత్యాల కిషోర్ బాబు విద్యార్థుల విజయంపై ఆనందం వ్యక్తం చేస్తూ, వారిని అభినందించింది.

కూచిపూడి నాట్య కళాపీఠంలో ప్రవేశాలకి అనుమతి

విశాలాంధ్ర-కూచిపూడి : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (బొమ్మూరు రాజమహేంద్రవరం) కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళా పీఠంలో 2025-26 విద్యా సంవత్సరానికి ఎట్టకేలకు ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేశారు. గత విద్యా సంవత్సరం (2024-25) నుంచి ప్రవేశాలకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం (హైదరాబాద్) అనుమతులు ఇవ్వకపోవడంతో కూచిపూడి నాట్యం పై ఆసక్తిగల విద్యార్థినీ విద్యార్థులు నిరుత్సాహ పడ్డారు. అయితే ఇటీవల తెలంగాణా విశ్వవిద్యాలయం నుంచి నుంచి విడగొట్టి ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్ర వరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు చేపట్టి తెలుగు విశ్వవిద్యాలయంతో అనుబంధం కలిగిన ఆచార్య డి మునిరత్నంనాయుడును ఇన్చార్జి ఉపకులపతిగా నియమించారు. ఆయన ఈనెల 23 వ తారీఖున రాజమహేంద్రవరంలో బాధ్యతలు చేపట్టిన వెంటనే తీసుకున్న నిర్ణయంతో మూడు పీఠాలలో నిర్వహించే వివిధ రకాల కోర్సులకు ప్రవేశాలపై దృష్టి సారించి పిలుపునిచ్చారు. దీనితో ఉపకులపతి ఆదేశాలతో శ్రీ సిద్ధేంద్ర యోగి కూచిపూడి మార్గాల పీఠంలో కొనసాగుతున్న ఎం. పి. ఏ.కూచిపూడి నృత్యం, సర్టిఫికెట్, డిప్లమో, సాత్విక వినయం, యక్షగానం కోర్సులలో ఆసక్తిగల విద్యార్థులు 500 రూపాయలు దరఖాస్తు ఫారం కు చెల్లించి నవంబరు 15వ తేదీ లోపుగా కన్వీనర్, సెంట్రల్ అడ్మిషన్స్ కమిటీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, బొమ్మూరు రాజమహేంద్రవరం- 53 31224 .. (ఆంధ్ర ప్రదేశ్) కు సమర్పించాలని సెంట్రల్ అడ్మిషన్స్ కమిటీ కన్వీనర్ గా నియమితులైన శ్రీశైలం పీఠం డీన్, శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్య కళా పీఠం ప్రధాన ఆచార్యులు(పూర్తి అదనపు బాధ్యతలు) డాక్టర్ ఎం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.అపరాధ రుసుము అదనంగా 200 రూపాయలతో దరఖాస్తులు నవంబరు 20వ తారీకు లోపు పంపే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే రాజమహేంద్రవరం, శ్రీశైలం పీఠాలలో నిర్వహించే ఎంఏ తెలుగు, ఎం.ఏ..చరిత్ర, పీ.హెచ్.డి(రెగ్యులర్ %ఽ% ఇండస్ట్రియల్)., చరిత్ర- సంస్కృతి- పురావస్తు శాస్త్రం, కోర్సులకు సైతం ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు కన్వీనర్ పేర్కొన్నారు. పూర్తి వివరాలకు. www.telugu universityap.in లో తెలుసుకోవచ్చునని,అలాగే మరిన్ని వివరాలకు సెంట్రల్ అడ్మిషన్స్ కమిటీ కన్వీనర్ సెల్ నెంబర్ 94 41 37 0 5 91ని సంప్రదించాలని ఆయన సూచించారు.

పర్యావరణ హితంగా స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తల ఊటీ యాత్ర స్టీలు వస్తువులు, స్టీలు బాటిల్స్ వెంట తీసుకువెళ్లి

విశాలాంధ్ర-చల్లపల్లి : ఒక్కసారి వాడిపారేసే ప్లాస్టిక్కు వ్యతిరేకంగా పర్యావరణ హిత పద్ధతులను అవలంభిస్తున్న స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు తమ ఊటీ యాత్రను సైతం పర్యావరణ హితం గా పూర్తిచేశారు. స్వచ్ఛ చల్లపల్లి రథసారధులు డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్ డాక్టర్ పద్మావతి దంపతులు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారితోపాటు 26 మంది స్వచ్ఛ కార్యకర్తల బృందం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులేమీ వాడకుండా యాత్ర చేశారు. ఊటీ యాత్రకు వెళ్లిన బృంద సభ్యులు ఆదివారం చల్లపల్లి తిరిగివచ్చారు. రైలులో తినేందుకు తీసుకువెళ్లిన ఆహారాన్ని స్టీలు క్యాన్లలో తీసుకువెళ్లి, స్టీలు ప్లేట్లను, బాటిల్స్ను ఉపయోగించారు. 20లీటర్ల వాటర్ క్యానన్ను చల్లపల్లి నుంచి తీసుకువెళ్లి అవసరమైనపుడు క్యాన్లో లో నీటిని నింపుకుని స్టీల్ బాటిల్సోకి పట్టుకున్నారు. గత పదేళ్లుగా చేపట్టిన విహార యాత్రలన్నీ పర్యావరణ హితంగానే చేశామనీ, ఊటీలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధాన్ని పకడ్బందీగా అమలుచేస్తున్నారని స్వచ్ఛ చల్లపల్లి సారధి డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్ తెలిపారు. ఊటీ కొండ ఎక్కేప్పుడు బస్ డ్రైవర్ బస్సు ఆపి చెకింగ్ ఉంటుంది ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ ఉంటే 100 రూపాయల జరిమానా వేస్తారు. అని అనౌన్స్‌యటం ఆశ్చర్యం కలిగించిందన్నారు. గ్రామాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని స్థానిక సంస్థలు అమలుచేయాలనీ, విద్యార్థుల కరిక్యులమ్లో సైతం చేర్చాలని డిఆర్కె.ప్రసాద్ కోరారు. డాక్టర్ ఎం.వరప్రసాద్ దంపతులు, ఎస్ఐసి భాషా, ప్రాతూరి శాస్త్రి తదితరులు ఊటీ వెళ్లిన వారిలో ఉన్నారు.

జనసేన బలోపేతం దిశగా కృషి చేయాలి : ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

విశాలాంధ్ర - అవనిగడ్డ: జనసేన పార్టీకి మంచి పేరు తెచ్చేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో వెలువోలు గ్రామ జనసేన అధ్యక్షుడు కోనేరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గోగినేనిపాలెం గ్రామానికి చెందిన జనసైనికుడు కుంపటి నాగశ్రీను తన బంధుమిత్రులు, గ్రామస్తులు 12 మందిని జనసేన పార్టీలో చేర్చారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, జనసేన పార్టీ నాయకులు మండలి వెంకట్రామ్ లు కొత్తగా పార్టీలో చేరిన వారికి జనసేన కండువాలతో ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో చోరగుడి రవి, కొడాలి నరేంద్ర, కుంపటి వెంకన్న, నాగ గోపి, బన్నీ, నాగమల్లేశ్వరరావు, సుబ్బారావు, రమేష్, నాగరాజు, సురేష్, చోరగుడి చిన్న సాంబయ్య తదితరులు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం ద్వారా ప్రజల నమ్మకం గెలుచుకోవడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

మంత్రితో మంతనాలు చేసిన మసిముక్కు

విశాలాంధ్ర-పెదపారుపూడి : రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధిని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, పామర్రు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దానబోయిన వెంకట్ నారాయణ, గోగం రామారావులు మర్యాదపూర్వకం గా కలిసి మండల రాజకీయాలపై చర్చించినట్లు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మసిముక్కు మాట్లాడుతూ ఒక ప్రైవేటు కార్యక్రమానికి గుడివాడ వచ్చిన సందర్భంగా మండలంలోని టిడిపి నాయకులు సారధికి స్వాగతం పలికి మంతనాలు చేసినట్లు ఆయన వివరించారు.

తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో

కృష్ణ తీరం అప్రమత్తం

విశాలాంధ్ర, తోట్లవల్లూరు : మంతా తుఫాన్ దూసుకొస్తుందన్న హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాలను అధికారుల అప్రమత్తం చేస్తున్నారు. బలమైన ఈదురు గాలులు వీచవచ్చనే హెచ్చరికల నేపథ్యంలో గుడిసెల్లో ఉన్నవారిని తుఫాన్ పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు పలు గ్రామాల్లో ఇప్పటికే పాఠశాలలో తదితర ప్రభుత్వ కార్యాలయాలను తుఫాన్ పునరావాస కేంద్రాలుగా మార్చిన అధికారులను పాఠశాలలకు మూడు రోజులు సెలవులు ప్రకటించింది. అధికారులు గ్రామాల్లో పర్యటించి తుఫాన్ ప్రభావం పై ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. భారీ వృక్షాలను వాటి కింద నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు ప్రతి గ్రామంలోనూ గ్రామ కార్యదర్శి తో పాటు సచివాలయ సిబ్బంది ఈ మూడు రోజులపాటు అందుబాటులో ఉండాలని గ్రామాల్లోనే ఉండాలని ఆదేశాలు జారీ చేశారు తాగునీరు భోజనం సదుపాయాల కోసం ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు కృష్ణా నదిలో వరద ఉధృతి పెరగనున్న దృశ్య తీర ప్రాంతాలను అప్రమత్తం చేశారు ఆదివారం మండలంలో పర్యటించిన పామూరు శాసనసభ్యులు వర్ల రాజకుమార్ అధికారులతో పరిస్థితి సమీక్షించారు తుఫాన్ బాధితులను ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలని సహాయ చర్యల్లో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు.

ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రపంచ స్ట్రోక్ దినోత్సవ కార్యక్రమాలు

కృష్ణాజిల్లా గుడివాడ, కోడూరులో విజయవంతంగా నిర్వహించిన ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ప్రపంచ స్ట్రోక్ దినోత్సవం (అక్టోబర్ 29)ను పురస్కరించుకుని, ప్రజల్లో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించేందుకు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో కోడూరు, గుడివాడ పట్టణాల్లో ప్రత్యేక ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కోడూరులో పాంచజన్య గీతా పారాయణ సంఘం సహకారంతో నిర్వహించిన వాక్‌థాన్, సిపిఆర్, బిఎల్ఎస్ శిక్షణ, అలాగే ఉచిత వైద్య శిబిరం ప్రజల నుండి విశేష స్పందన పొందాయి. ఈ ఉచిత వైద్య శిబిరంలో 450 మంది ప్రజలు పాల్గొని రక్తపోటు, షుగర్, కొలెస్ట్రాల్ వంటి సైలెంట్ కిల్లర్స్ పై అవగా హన పొందారన్నారు. స్ట్రోక్, గుండె సంబంధిత వ్యాధుల నివారణపై వైద్యులు విలువైన సూచనలు అందించారు. కోడూరులో శ్రీ పాంచజన్య గీతా పారాయణ సంఘం ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైద్యులు, మరియు వాలంటీర్లు చురుకుగా పాల్గొని ఈ ప్రజాహిత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గుడివాడలో

గుడివాడలో నిర్వహించిన వాక్‌థాన్, సిపిఆర్ శిక్షణ, మరియు ఉచిత వైద్య శిబిరం కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.గుడివాడ ఐఎంఏ కార్యదర్శి డా. మాగంటి శ్రీనివాస్ గారు వాక్‌థాన్‌ను ప్రారంభించి, సహ సైక్లిస్టులతో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించడమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు సకాలంలో స్పందించడానికి ప్రేరణనిస్తాయి,” అని పేర్కొన్నారు.ఈ శిబిరంలో 200 మంది ప్రజలు ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయించుకుని లబ్ధి పొందారన్నారు. ఈ కార్యక్రమాలు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వాలంటీర్ల సామాజిక సేవా కార్యక్రమాల భాగంగా నిర్వహించబడి, ప్రజల నుండి విస్తృత ఆదరణ లభించిందని నిర్వాహకులు తెలిపారు.ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా. పోతినేని రమేష్ బాబు గారు మాట్లాడుతూ “ప్రజల ఆరోగ్య రక్షణలో అవగాహన అత్యంత కీలకం. సకాలంలో పరీక్షలు చేయించుకోవడం, బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంచుకోవడం, మరియు స్ట్రోక్ లేదా గుండె సమస్యల లక్షణాలను గుర్తించి వెంటనే వైద్య సాయం పొందడం ద్వారా అనేక ప్రాణాలను రక్షించవచ్చు. ఈ తరహా ప్రజాహిత కార్యక్రమాలు సమాజానికి ఆరోగ్య భద్రతను అందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి,” అన్నారు.

ఘనంగా కార్తీక వనసమారాధన

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి అవతార్ మెహెర్ బాబా మందిరంలో ఆదివారం కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఐదున్నర గంటల నుండి ఏడు గం టల వరకు ఏకనామం, సంకీర్తనలు, మద్దాలి దుర్గాప్రసాద్ చే ఆధ్యాత్మిక ప్రసంగ కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం మెహెర్ బాబా భక్తులు సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. బాబాసెంటరు అధ్యక్ష కార్యదర్శులు చుండూరు మెహర్ ప్రసాద్, పత్రి రమణారావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.